
జూలై 27 నుంచి '2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచారాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలి. రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి డివిజన్ కమిటీ, బూత్ ఇన్‌చార్జి, నాయకుడు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించి ప్రభుత్వ విజయాలను చేరవేయాలి.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 23.07.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 92 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# మంగళగిరే నా కుటుంబం

**● ప్రజల ఆశీస్సులతోనే అభివృద్ధి సాధ్యమైంది ● ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతానన్న లోకేశ్**


**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రమంతా మంగళగిరి వైపు చూసేవిధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా, మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నాకు ప్రజల ఆశీస్సులు కావాలి, మంగళగిరి నియోజకవర్గం నా సొంత కుటుంబం, ఇక్కడి ప్రజల దీవెనలే తనకు కొండంత బలాన్నిస్తాయని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. మన ఇల్లు -- మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా స్థానిక సికె కన్వెన్షన్ సెంటర్ లో రెండోరోజు మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన పేదలకు శాశ్వత పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మంగళగిరి నియోజకవర్గం ప్రజల ఆశీస్సులే నాకు కొండంత బలం. మీరిచ్చిన 91వేల మెజారిటీ వల్లే నేను పెద్దఎత్తున పనులు చేయగలుగుతున్నా. భారీ విజయం ఇవ్వడంవల్లే కేంద్ర పెద్దలతో మాట్లాడి పెద్దఎత్తున నిధులుతెచ్చి, అభివృద్ధి పనులు చేయగలుగుతున్నా.

**మంగళగిరి ప్రజల మనసు గెలిచా :** నేను మంగళగిరిలో పుట్టిపెరగలేదు. నాకు సొంత అక్కాచెల్లెళ్లు లేరు, మంగళగిరి ప్రజలను చూస్తుంటే సొంతవారిని చూస్తున్నట్లుగా ఉంటుంది. 2019లో మంగళగిరిలో పోటీ చేసినప్పుడు, ఇంటిపట్టాలు రెగ్యులరైజ్ చేస్తామని మాట ఇమ్మని అడిగారు. అవగాహన లేకుండా లేనిపోని హామీలు ఇవ్వకూడదని చెప్పా. ఫలితంగా 5300 ఓట్ల తేడాతో ఓడిపోయా. ఓటమి ఎవరికైనా బాధ కలుగుతుంది. ఓటమి నాలో కసి పెంచింది. అయిదేళ్లు అహర్నిశలు కష్టపడి మంగళగిరి ప్రజల మనసు గెలుచుకున్నా. ప్రజలకు ఆరోగ్యం బాగోలేకపోతే ఎన్టీఆర్ సంజీవని క్లినిక్ ద్వారా మందులు అందించా. నిరుపేదలకు తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లు, స్త్రీశక్తి పేరిట మహిళలకు ట్రైనింగ్ ఇచ్చి కుట్టు మిషన్లు ఇచ్చా. పేదల ఇంట్లో పెళ్లి జరిగితే బట్టలు పెట్టా, కుటుంబంలో దురదృష్టవశాత్తు ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు ఖర్చులు అందించా. చెట్ల కింద సేదదీరడానికి సిమెంటు బల్లలు ఏర్పాటుచేశా. సుమారు 29 సంక్షేమ కార్యక్రమాలను ప్రతిపక్షంలో ఉండగా సొంత నిధులతో చేపట్టా.

**హామీలు నెరవేర్చేందుకు రేయింబవళ్లు పనిచేస్తున్నా :** గతఎన్నికల్లో ఘన విజయం సాధించాక ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకునేందుకు రేయింబవళ్లు కష్టపడుతున్నా. తొలివిడతలో 3వేలమందికి, రెండోవిడతలో మరో 3వేలమందికి శాశ్వత పట్టాలు పారదర్శకంగా అందిస్తున్నాం.

**మోడల్ నియోజకవర్గంగా మార్చేందుకు కృషి :** మంగళగిరిని మోడల్ నియోజకవర్గంగా మార్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నా. వందపడకల ఆసుపత్రి, గ్రామాల్లో పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, శ్మశానాలు అభివృద్ధి చేస్తున్నా. రాష్ట్రానికి బడ్జెట్

2 లో..▶




## ఆరు గంటలు... ఆగని లోకేష్

- నిలబడి లబ్ధిదారులకు పట్టాల పంపిణీ
- రెండు రోజుల్లో 2,634 మందికి ఇంటి హక్కుపత్రాలు

● వివరాలు 2 లో



# భూ రికార్డులకు బ్లాక్‌చెయిన్ భద్రత



- 'మీ భూమి-బ్లాక్‌చెయిన్' పైలట్‌కు నేడు సీఎం చంద్రబాబు శ్రీకారం
- ఏడు జిల్లాల ఏడు మండలాల్లో అమలు.. భూ మోసాలకు చెక్ లక్ష్యం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** భూ రికార్డుల నిర్వహణలో సాంకేతిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో విడివిడిగా ఉన్న భూ సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకువస్తూ, రాష్ట్రంలోని భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా నిలిచే 'మీభూమి-బ్లాక్ చెయిన్' వ్యవస్థను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. గురువారం మధ్యాహ్నం రాష్ట్ర సచివాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది. కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రస్తుతం వెబ్‌ల్యాండ్ ద్వారా భూ రికార్డులు డిజిటలైజ్ అయినప్పటికీ, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో సమాచారం వేర్వేరుగా ఉండటం వల్ల డేటా వ్యత్యాసాలు, రికార్డుల్లో మార్పులను గుర్తించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా మీ భూమి-బ్లాక్ చెయిన్ వ్యవస్థను రూపొందించారు. NIC ఆంధ్రప్రదేశ్, NIC బెంగళూరులోని సెంటరాఫ్ ఎక్స్ లైన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో ఈ వ్యవస్థను అభివృద్ధి చేశాయి. ఈ వ్యవస్థలో ప్రతి భూ పార్సెల్‌కు ప్రత్యేక బ్లాక్‌చెయిన్ గుర్తింపు కల్పిస్తారు. ప్రతి లావాదేవీ టాంపర్-ప్రూఫ్,

మిగతా 2లో...

## ఎల్‌నినోతో విద్యుత్ వినియోగం పెరిగింది



- జలవిద్యుత్ తగ్గినా థర్మల్ ఉత్పత్తి పెంచాలని అధికారులకు గొట్టిపాటి ఆదేశం
- 15 రోజుల బొగ్గు నిల్వలు సిద్ధంగా ఉంచాలని సూచన

**అమరావతి, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్):** ఎల్ నినో ప్రభావంతో తగ్గిన జల విద్యుత్ ఉత్పత్తితో ఇబ్బందులు లేకుండా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి పెంచాలని ఉన్నతాధికారులను ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. బుధవారం రాజధాని అమరావతిలో రాష్ట్రంలో నెలకొన్న ఎల్ నినో పరిస్థితులపై

మిగతా 2లో...

## హజ్-2027కు రేపే చివరి గడువు



- దరఖాస్తులకు శుక్రవారం అర్ధరాత్రితో ముగింపు...
- త్వరపడాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పిలుపు

మిగతా 2లో...

## రైతు కష్టానికి కేంద్రం చేయూత!



- పొగాకు, ఆక్వా సమస్యలపై కీలక పురోగతి
- జీఎస్టీ తగ్గింపు దిశగా అడుగులు.. త్వరలో నిర్ణయం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని పొగాకు, ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని,

2లో...

## భోగాపురం వేడుకకు యంత్రాంగం సిద్ధం



- సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు మంత్రుల ఆదేశం
- థింసా నృత్యంతో ఉత్తరాంధ్ర సంస్కృతికి ప్రాధాన్యం
- పింఛన్ల ముందస్తు పంపిణీకి నిర్ణయం

3 లో

## జీవో-3కు మళ్లీ జీవం




- పునరుద్ధరణకు కూటమి కట్టుబడి ఉంది
- గిరిజన హక్కులకు పూర్తి భరోసా

3 లో

**విజయవాడ, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్):** జీవో నంబర్-3 పునరుద్ధరణతో పాటు గిరిజనుల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు.

## భూములకు భరోసా



- 22ఏ చిక్కుల పరిష్కారానికి కొత్త ఉత్తర్వులు
- భూ యజమానులకు మరింత రక్షణ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గత ప్రభుత్వ అక్రమాల కారణంగా వేలాదిమంది రైతులు సామాన్య భూ యజమానుల భూములు 22ఏ నిషేధిత జాబితాలో చిక్కుకుని ఎదుర్కొంటున్న

2

## చదువుకు అండగా 'తల్లికి వందనం'

- విద్యా సంవత్సరం ప్రారంభంలోనే నిధుల విడుదల
- ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా అందరికీ పథకం వర్తిస్తుందని లోకేశ్ వెల్లడి



**అమరావతి, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తల్లికి వందనం' పథకం నిధులను విడుదల చేసింది.

## పంచదార్ల తవ్వకాలపై సమగ్ర విచారణ

- పర్యావరణ ఉల్లంఘనలపై నివేదిక ఇవ్వాలని అధికారులకు పవన్ కల్యాణ్ ఆదేశం
- మైనింగ్ సంస్థ అనుమతులు రద్దు..
- 'నో మైనింగ్ జోన్'గా ప్రకటించాలని సూచన



**అమరావతి, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్):** అనకాపల్లి జిల్లా, రాంబిల్లి మండల పరిధిలోని పంచదార్ల కొండపై రెవెన్యూ భూముల్లో జరుగుతున్న గ్రావెల్ తవ్వకాల్లో పర్యావరణ నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర విచారణ జరిపి, నివేదిక సమర్పించాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. పంచదార్ల కొండ తవ్వకాల్లో అక్రమాలపై అనకాపల్లి జిల్లా కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో మాట్లాడారు. కలెక్టర్ ఇచ్చిన ప్రాథమిక నివేదికను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్, పీసీబీ అధికారుల ప్రాథమిక నివేదికల్లో మైనింగ్ అనుమతులు పొందిన సంస్థ నిబంధనల ఉల్లంఘనకు

మిగతా 2లో...

## బీసీ విద్యకు పెద్దపీట



- గురుకులాలు, హాస్టళ్ల అభివృద్ధికి భారీ నిధులు
- వచ్చే విద్యా సంవత్సరంలో మరిన్ని ఎంజేపీ గురుకులాలు
- నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి సవిత

**రామగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రస్తుత విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో పది కొత్త మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలను ప్రారంభించామని,

మిగతా 3లో...

## ఉద్యోగులకు ప్రభుత్వం భరోసా



- 21 ఉద్యోగ సంఘాలతో చర్చలు
- సమస్యల పరిష్కారానికి సానుకూల హామీ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన వివిధ అంశాలను సాధ్యమైనంత వరకూ పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నం చేస్తుందుని రాష్ట్ర ఆర్థిక,వాణిజ్య మరియు శాసన సభ వ్యవహారాల శాఖామాత్యులు పయ్యావుల కేశవ్ ఉద్యోగ సంఘాలకు స్పష్టం చేశారు.బుధవారం ఎపి సచివాలయంలో 21 ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఆయన నేతృత్వంలోని మంత్రుల బృందం సమావేశమై సుమారు 5గం.ల పాటు ఉద్యోగుల సమస్యలను తెల్సుకుంది.సమావేశ అనంతరం ఆర్థిక మంత్రి మాట్లాడుతూ 21 ఉద్యోగ సంఘాల నుండి అన్ని సమస్యలను తెలుసుకున్నామని వాటన్నిటినీ

మిగతా 3లో...

## ఆరు గంటలు... ఆగని లోకేశ్



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** మన ఇల్లు - మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా వరుసగా రెండోరోజు కూడా మంత్రి నారా లోకేష్ 6 గంటలపాటు నిలబడి పట్టాలు పంపిణీ చేశారు. రెండోరోజున ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 3.30గంటలవరకు 6గంటలపాటు సికె కన్వెన్షన్ వేదికపై నుంచి లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. తొలిరోజున 1331మందికి, రెండోరోజున 1303మందికి మొత్తంగా 2,634మందికి నూతన వస్త్రాలు పెట్టి పట్టాలు అందించారు. మలివిడతలో మంత్రి లోకేష్ అందజేసిన పట్టాల మార్కెట్ విలువ సుమారు రూ. 1000 కోట్లుగా ఉంది. రెండోరోజు కూడా ఓపికగా నిలబడి పట్టాలు అందించిన లోకేష్... పలువురు దివ్యాంగ లబ్ధిదారులకు వేదిక కిందకు దిగి వెళ్లి పట్టాలను అందించారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి లబ్ధిదారు, వారి కుటుంబ సభ్యులతో ఫోటోలు దిగారు. తొలివిడత గత ఏడాది ఏప్రిల్ నెలలో 3,003 మందికి పట్టాలు అందజేశారు. 2029లోగా నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ భూముల్లో దీర్ఘకాలంగా నివాసముంటున్న ప్రతి లబ్ధిదారుడికి పట్టాలు అందజేస్తానని గత ఎన్నికల సమయంలో యువనేత లోకేష్ హామీ ఇచ్చారు. ఇరిగేషన్, రెవిన్యూ, అటవీ, దేవాదాయ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, రైల్వే తదితర శాఖలకు చెందిన భూముల్లో పేదలు దాదాపు మూడు దశాబ్దాలకు పైబడి ఇళు నిర్మించుకొని జీవిస్తున్నారు. నాడు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు వివిధ శాఖలకు చెందిన రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ పలుమార్లు సంప్రదింపులు జరిపి, శాఖలవారీగా స్థలాల సమస్యను పరిష్కరించారు. కేంద్రప్రభుత్వంతో ముడిపడివున్న మరికొన్ని భూముల సమస్యను పరిష్కరించాల్సి ఉంది. వాటిపై కూడా కేంద్ర పెద్దలతో మంత్రి లోకేష్ సంప్రదింపులు జరుపుతున్నారు.

## ఎల్‌నినోతో విద్యుత్ వినియోగం పెరిగింది

(మొదటి పేజీ తరువాయి)

అధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్ష నిర్వహించారు. 15 రోజుల విద్యుత్ ఉత్పత్తికి తగిన విధంగా బొగ్గు నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రస్తుత రోజువారీ డిమాండ్ 280 మిలియన్ యూనిట్‌లకు అనుగుణంగా రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆయన స్పష్టం చేశారు.

పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిపై విద్యుత్ అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని పేర్కొన్నారు. ఎల్ నినోతో విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. వర్షాభావ పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కోవాలని వారికి సూచించారు. ట్రాన్స్ కో, జెన్కో, డిస్కంల సమన్వయంతో ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు మంత్రి గొట్టిపాటి వివరించారు. ఈ సమీక్ష సమావేశానికి ఏపీ ట్రాన్స్ కో, జెన్‌కో ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## చదువుకు అండగా 'తల్లికి వందనం'

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థుల విద్యకు ఎలాంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో విద్యా సంవత్సరం ప్రారంభంలోనే నిధులను జమ చేస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన 42.70 లక్షల మంది తల్లుల బ్యాంక్ ఖాతాల్లో మొత్తం రూ. 10,120.78 కోట్లను ప్రభుత్వం జమ చేస్తుంది. అర్హులైన ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో రూ. 13,000 చొప్పున చేరుతుండగా, ఈ ఆర్థిక సహాయ ప్రక్రియ ఈ నెల 24 వరకు కొనసాగనుంది.

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ సోషల్ మీడియా (x) వేదికగా స్పందిస్తూ "పిల్లలే మన సంపద, వారి చదువులే తరగని ఆస్తి" అని పేర్కొన్నారు. గతంలో లాగా కాకుండా, ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికి ఎలాంటి ఆంక్షలు లేకుండా ఈ పథకం ప్రయోజనాలను అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఒకటో తరగతి నుండి ఇంటర్మీడియట్ వం-కు చదువుతున్న దాదాపు 67.47 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనుందని, పిల్లలను చదివిస్తున్న ప్రతి తల్లికీ తన హృదయపూర్వక వందనాలు తెలియజేస్తున్నానని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ ఆనందం వ్యక్తం చేశారు.

## పంచదార్ల తవ్వకాలపై సమగ్ర విచారణ



(మొదటి పేజీ తరువాయి)

పాల్పడినట్టు ప్రాథమిక ఆధారాలు ఉన్న క్రమంలో... పర్యావరణ నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్, మట్టి తవ్వకాలకు పాల్పడిన సదరు సంస్థపై నిబంధనల మేరకు జరిమానా విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. మైనింగ్ కారణంగా పంచదార్ల కొండ దిగువన ఉన్న శ్రీ ఉమా ధర్మలింగేశ్వర స్వామి వారి ఆలయం, సహజ జలధారల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని సంరక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. జలధారల రంగు మార్పుపై జాతీయ జలవిజ్ఞాన సంస్థ శాస్త్రవేత్తలను ఆహ్వానించి, ఆ జలధార మూలాలను పరిశీలించి, సహజ ప్రవాహ సంరక్షణకు సంబంధించిన శాస్త్రీయ నివేదికలు తీసుకోవాలన్నారు. సహజ జలధారల సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించిన సంస్థపై జరిమానాతోపాటు పర్యావరణ పునరుద్ధరణ బాధ్యత కూడా వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అదే సమయంలో పురాతన ఆలయాలు, ప్రకృతి వనరుల సంరక్షణ బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. పంచదార్ల కొండ వద్ద ఉన్న శ్రీ ఉమా ధర్మలింగేశ్వర స్వామి ఆలయ పరిరక్షణకు పురావస్తు శాఖ, దేవాదాయ శాఖ సంయుక్త కార్యాచరణ చేపట్టాలని నిర్దేశించారు. దీంతోపాటు పర్యావరణ పరిరక్షణలో భాగంగా పంచదార్ల కొండ పరిసరాలను నో మైనింగ్ జోన్‌గా ప్రకటించాలని రెవెన్యూ, మైనింగ్ శాఖలకు సూచించారు. సదరు మైనింగ్ సంస్థకు ఇచ్చిన పర్యావరణ అనుమతులు, ఎస్టాబ్లిష్ మెంట్, ఆపరేషన్స్ అనుమతులు తక్షణమే రద్దు చేయాలన్నారు.

# మంగళగిరే నా కుటుంబం

(మొదటి పేజీ తరువాయి)



కొరత ఉన్నా మిత్రుల సహకారంతో, సిఎస్ఆర్ నిధుల ద్వారా మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నా. ఈరోజు భారతదేశం మొత్తం నిడమర్రు స్కూలు గురించి మాట్లాడుతోంది. మంగళగిరిలో ఒక కార్యక్రమానికి వెళ్లినప్పుడు తన కుమార్తెకు నిడమర్రు స్కూలులో సీటుకావాలని ఓ తల్లి నాతో గొడవపడింది. ప్రభుత్వ పాఠశాలలో సీటుకోసం ప్రజలు దెబ్బలాడటం నేను గతంలో ఎన్నడూ చూడలేదు. వ్యవస్థను మెరుగుపర్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నా. మంగళగిరి నియోజకవర్గ భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలు సిద్ధం చేశాం. నియోజకవర్గం అంతటా చేయాలంటే 1800 కోట్లు ఖర్చు అవుతుంది. కేంద్రంతో సంప్రదించి చాలెంజ్ ఫండ్ నుంచి నిధులు తెచ్చి, రాష్ట్రప్రభుత్వ మ్యాచింగ్ నిధులు కలిపి భూగర్భ డ్రైనేజి పనులు ప్రారంభించాం. తాగునీరు, పైప్ లైన్ గ్యాస్, వందపడకల ఆసుపత్రి, మహానాడు రిటైనింగ్ వాల్ పనులు కూడా ప్రారంభిస్తున్నాం. లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని కూడా అభివృద్ధి చేస్తున్నాం. మూసేసిన అన్నా క్యాంటీన్లు ప్రారంభించాం, తాగునీటి వాటర్ ప్లాంట్ లు ఏర్పాటుచేశాం. గుడులు, చర్చిలు, మసీదులు పనులను కూడా విడతల వారీగా చేస్తాం. ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చేందుకు శక్తి వంచనలేకుండా ప్రయత్నిస్తున్నా.

**ప్రజాసంక్షేమమే లక్ష్యం :**

తల్లికి వందనం కింద ప్రభుత్వం 10వేలకోట్లు ఖర్చుచేస్తోంది. ఎంత మంది పిల్లలుంటే అంతమందికి పథకం అమలు చేస్తున్నాం. గత ఏడాది జూన్ మాసంలో పిల్లలు స్కూలులో జాయిన్ కాకుండా ఇవ్వడం వల్ల చిన్నచిన్న సమస్యలు వచ్చాయి. ఈసారి ఒక నెల సమయం తీసుకొని ఈరోజు నుంచి 24వరకు తల్లికివందనం నిధులు తల్లుల ఖాతాలో జమచేస్తున్నాం.

4వేలపెన్షన్, ఉచిత సిలెండర్లు, స్త్రీశక్తి, మత్స్యకార సేవలో, చేనేత సోదరులకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలను ఒక పద్ధతి ప్రకారం అమలు చేస్తున్నాం. పార్లమెంటు సమావేశాలు ఉన్నందున ఎంపీ పెమ్మసాని ఈ కార్యక్రమానికి రాలేకపోయారు. అనేక కేంద్రప్రభుత్వ పథకాలను రాష్ట్రానికి రప్పించేందుకు ఆయన కృషిచేస్తున్నారు. నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను 12నెలల్లో పూర్తిచేసేలా పనులు వేగవంతం చేశాం. ఇద్దరం కలసికట్టుగా పనిచేయడం వల్లే పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేయగలుగుతున్నాం. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నేతలు నందం అబద్ధయ్య, పోతినేని శ్రీనివాసరావు, వల్లభనేని వెంకట్రావు, పడాల మహేష్ పాల్గొన్నారు.

# రైతు కష్టానికి కేంద్రం చేయూత!

(మొదటి పేజీ తరువాయి)



కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. బుధవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రెండు రోజులు ఢిల్లీలో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్‌గోయల్, లలన్ సింగ్ , శివరాజ్ సింగ్ చౌహన్ లతో విస్తృతంగా చర్చలు జరిపామని, రైతులకు ఊరటనిచ్చే నిర్ణయాలు త్వరలో వెలువడనున్నాయని వెల్లడించారు. ముడి పొగాకుపై జీఎస్టీ తగ్గింపు, అదనపు ఆర్థిక సాయం, ఆక్వాఫీడ్ ధరల నియంత్రణ వంటి కీలక అంశాలపై కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు.

గత ఏడాది పొగాకు ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఈసారి టొబాకో బోర్డు అనుమతించిన 1.44 మిలియన్ కిలోల ఉత్పత్తికి దాదాపు రెట్టింపు స్థాయిలో సాగు చేశారని తెలిపారు. అదే సమయంలో అంతర్జాతీయ యుద్ధ పరిస్థితులు, ముడి పొగాకుపై జీఎస్టీ 27 శాతం నుంచి 40 శాతానికి పెరగడం వంటి పరిణామాలు రంగంపై తీవ్ర ప్రభావం చూపాయని వివరించారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలుమార్లు సమీక్షలు నిర్వహించి, కంపెనీలు రైతుల వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేయాలని ఆదేశించారని చెప్పారు. ఇటీవల కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారమన్ తో సమావేశమై పొగాకు రైతుల సమస్యలను వివరించామని, ముడి పొగాకుపై జీఎస్టీని తగ్గించాలని కోరామని, ఆ అంశాన్ని జీఎస్టీ కౌన్సిల్ సమావేశ ఎజెండాలో చేర్చి సానుకూల నిర్ణయం తీసుకుంటామని కేంద్ర ఆర్థిక మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా టొబాకో బోర్డు వద్ద రైతుల నుంచి వసూలు చేసిన సుమారు రూ. 750 కోట్ల సెస్ నిధుల నుంచి కిలోకు రూ. 15 చొప్పున రైతులకు ఆర్థిక సాయం అందించాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. ఈ అంశంపై కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్‌గోయల్‌తో ఇప్పటికే చర్చలు జరిగాయని, రెండు రోజుల్లో సానుకూల నిర్ణయం వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. పొగాకు కొనుగోళ్లపై ఐటీసీ సహా ప్రధాన పరిశ్రమల ప్రతినిధులతో మాట్లాడి రైతుల వద్ద ఉన్న మొత్తం పంటను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేయగా, అందరూ సానుకూలంగా స్పందించి కొనుగోళ్లకు హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు. ఆక్వా రంగానికి సంబంధించి ఫీడ్ ధరలు తగ్గించే దిశగా కూడా కేంద్రంతో చర్చలు జరిపామని, ఫిష్ మీల్, ఫిష్ ఆయిల్‌లో దేశీయ అవసరాలకు కనీసం 50 శాతం నిల్వ ఉంచి మిగిలిన పరిమాణాన్ని మాత్రమే ఎగుమతి చేయాలని కోరినట్లు చెప్పారు. అలాగే ఆక్వా ఫీడ్ తయారీకి అవసరమైన ముడి పదార్థాల దిగుమతులపై కూడా కేంద్రం సానుకూలంగా స్పందించిందన్నారు. తోతాపురి మామిడి ధరలు తగ్గిన సమయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి కిలోకు రూ. 4 ప్రోత్సాహక సాయం అందించి రైతులను ఆదుకుందని, ఇదే ప్రభుత్వ స్పందనకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు.

**రాజకీయ నాటకాలతో రైతులను తప్పుదోవ పట్టించొద్దు :** గొడ్డలి పార్టీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయ, ఆక్వా, పొగాకు సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో వ్యవసాయ, నీటిపారుదల రంగాలను పూర్తిగా నిర్వీర్యం చేసిన వ్యక్తి ఇప్పుడు రైతుల పేరుతో రాజకీయాలు చేయడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. పొగాకు రైతుల సమావేశాల పేరుతో నిజమైన రైతులను కాకుండా వైసీపీ కార్యకర్తలకు కండువాలు కప్పి రైతులుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భీమవరంలో జరిగిన ఆక్వా రైతుల ముఖాముఖి కార్యక్రమంలో కూడా డబ్బులు ఇచ్చి మహిళలు, వృద్ధులను తీసుకొచ్చి రైతుల సమావేశంగా ప్రచారం చేశారని విమర్శించారు. శ్రీకాకుళం జిల్లాలో ఇటీవల జరిగిన రెండు ఘటనలను ప్రస్తావించిన మంత్రి, మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన రోడ్డు ప్రమాదం కేసులో నిజానిజాలు వెలుగులోకి రావాల్సి ఉందని, ప్రభుత్వం చట్ట ప్రకారం చర్యలు తీసుకుందని తెలిపారు. అలాగే మాజీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం భూ ఆక్రమణ ఆరోపణలపైనా చట్టబద్ధ చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు నాయకులు రైతుల నుంచి తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసి, రియల్ ఎస్టేట్ పేరుతో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. బాధితులను కాకుండా తప్పుచేసిన వారిని పరామర్శల పేరుతో ధర్మాన సోదరులు ర్యాలీలు చేయడం విడ్డురంగా ఉందన్నారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చట్టం ముందు సమానమేనని, ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాను ప్రభుత్వ భూములకు కాపలాదారుడిగా వ్యవహరిస్తానని, నిజాయితీగా పనిచేసినందుకే గతంలో ఎదురైన ఇబ్బందులను ఎదుర్కొని నిర్దోషిగా బయటకు వచ్చానని మంత్రి పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీలో తప్పు చేసిన వారు సొంత కార్యకర్తలైనా చర్యలు తప్పవని, గుంటూరులో మహిళపై దాడి చేసిన టీడీపీ కార్యకర్తను అరెస్ట్ చేయడంతో పాటు పార్టీ నుంచి సస్పెండ్ చేశామని గుర్తు చేశారు. అయితే వైసీపీలో మాత్రం తప్పు చేసిన వారికి పదవులు ఇవ్వడం జరుగుతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు రాజకీయాల పేరుతో మోసపోకుండా వాస్తవాలను గుర్తించాలని, అభివృద్ధి, రైతు సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు.

## హజ్-2027కు రేపే చివరి గడువు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పవిత్ర మక్కా యాత్ర హజ్ -2027 కు దరఖాస్తు చేసుకునేందుకు గడువు రేపటితో ముగియనున్నది. కేంద్ర హజ్ కమిటీ పెంచిన నాలుగు రోజుల గడువు శు క్రవారం(24 వ తేది )అర్ధరాత్రికి ముగుస్తుండడంతో హజ్ యాత్ర చేయాలనుకునే వారు గడువు ముగిసేలోగా దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ విజ్ఞప్తి చేశారు. హాజీలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బుధవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి ఫరూక్ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పవిత్ర మక్కా యాత్ర హజ్ -2027కు ఇప్పటివరకు (బుధవారం)2421 మంది యాత్రికులు ఆన్ లైన్ ద్వారా తమ తమ పూర్తి వివరాలతో కేంద్ర హజ్ కమిటీకి దరఖాస్తు చేసుకోవడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన "షార్ట్ హజ్" ఆప్షన్ ద్వారా కుదించబడిన 20 రోజుల హజ్ యాత్ర కోసం 388 మంది హాజీలు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం కు మొదటి ప్రాధాన్యత ఇచ్చే ప్రయాణికులందరికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అందిస్తున్న రూ. లక్ష ఆర్థిక సాయం కు విశేష స్పందన లభిస్తున్నదని అన్నారు. హజ్ -2026 యాత్రలో గన్నవరం విమానాశ్రయం నుంచివెళ్లి విజయవంతంగా హజ్ యాత్ర పూర్తి చేసి వచ్చిన 331 మంది ప్రయాణికుల కు రూ. 3.31 కోట్లు మొత్తాన్ని వారి అకౌంట్లకు జమ చేయడం జరిగిందన్నారు. ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తున్న క్రమంలో విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం కు మొదటి ప్రాధాన్యత ఇచ్చే వారి సంఖ్య కూడా పెరిగిందన్నారు. హజ్ -2027 యాత్ర కోసం 517 మంది యాత్రికులు విజయవాడకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడమే ఇందుకు నిదర్శనమని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. కేంద్ర హజ్ కమిటీ నిర్ణయం మేరకు పొడిగించబడిన హజ్ యాత్ర దరఖాస్తు గడువును మక్కా యాత్ర చేయాలనుకునే వారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గడువులోగా పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని, విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం కు మొదటి ప్రాధాన్యత ఇచ్చి కూటమి ప్రభుత్వం అందిస్తున్న రూ. లక్ష ఆర్థిక సాయం పొందాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ విజ్ఞప్తి చేశారు.

## భూ రికార్డులకు బ్లాక్‌చెయిన్ భద్రత

(మొదటి పేజీ తరువాయి)

సెక్యూర్టీతో జరగనుంది. భూ రికార్డుల్లో ఎలాంటి మార్పు చేయాలన్నా ప్రభుత్వం నిర్దేశించిన ఆన్‌లైన్ సేవల ద్వారానే ఇకపై సాధ్యమవుతుంది. ఒక భూ పార్సెల్‌కు సంబంధించిన అన్ని రకాల లావాదేవీలు, వాటి ప్రతి వెర్షన్‌తో సహా శాశ్వతంగా నమోదయ్యేలా వ్యవస్థను తీర్చిదిద్దారు. ఇక ప్రతి లావాదేవీని ఏ అధికారి, ఎప్పుడు నిర్వహించారనే వివరాలు కూడా శాశ్వతంగా రికార్డుల్లో ఉంటాయి. రికార్డుల్లో ఏమైనా వ్యత్యాసం ఉంటే లావాదేవీ వెంటనే ఆగిపోయేలా వ్యవస్థను రూపొందించారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే వేదికపైకి తీసుకువస్తున్న ఈ వ్యవస్థలో ప్రస్తుతం ఆటో మ్యూటేషన్, సబ్-డివిజన్, ఎక్స్‌టెంట్ కరెక్షన్ సహా ఎనిమిది పౌర సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. వ్యవసాయం, మత్స్యశాఖ, గనులు, పరిశ్రమలు, విద్యుత్ శాఖ, సీఆర్‌డీఏ, ఆర్థిక సంస్థలు వంటి విభాగాలు కూడా అవసరమైన మేరకు ఈ సమాచారాన్ని వినియోగించుకునే అవకాశాన్ని కల్పించారు. మొదటి దశలో కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల పరిధిలోని అస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల్లో ఈ పైలట్ ప్రాజెక్టుగా అమలు కానుంది. ఈ పైలట్ ప్రాజెక్టులో 89 రీ-సర్వే గ్రామాలు, 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు కవర్ అవుతున్నాయి.

## తిరుమలలో 7వ మైలు వద్ద ఆంజనేయస్వామి విగ్రహం మాయం

**తిరుపతి(జర్నలిస్ట్ ఫైల్) :** తిరుమలలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. మొదటి ఘాట్ రోడ్డులోని 7వ మైలు వద్ద ఆంజనేయస్వామి విగ్రం మాయమైంది. నిత్యపూజలు అందుకునే ఆంజనేయ స్వామి విగ్రహాన్ని దుండగులు దొంగలించారు. విగ్రహం మాయమైన దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. కాషాయ దుస్తుల్లో వచ్చిన ఓ వ్యక్తి విగ్రహాన్ని ఎత్తుకెళ్లినట్టు వీడియోలో కనిపిస్తోంది. కాషాయ గుడ్డలో చుట్టి విగ్రహాన్ని దాచి పెడుతూ తీసుకువెళ్లినట్టు కనిపిస్తోంది. పవిత్ర పుణ్యక్షేత్రంలో విగ్రహం మాయం అవ్వడంపై భక్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఆలయం వద్దకు వచ్చిన భక్తులు విగ్రహం లేకపోవడంతో అక్కడే బొట్టుపెట్టుకుని, దండం పెట్టుకుని వెళ్లిపోతున్నారు. అయితే తిరుమల లాంటి ఆలయంలో విగ్రహం చోరీకి గురవ్వడంతో భద్రతా వ్యవస్థపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే దీనిపై ఆలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగి సీసీటీవీ ఫుటేజ్ సేకరించారు. ప్రస్తుతం ఆ వీడియోల ఆధారంగానే విచారణ జరుపుతున్నారు.

# భూములకు భరోసా

(మొదటి పేజీ తరువాయి)




తీవ్రమైన ఇబ్బందులకు శాశ్వత చరమగీతం పాడుతూ నిషేధిత జాబితా నుండి భూముల తొలగింపును సరళతరం చేస్తూ కొత్త ఉత్తర్వులను జారీ చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ,రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి అనగాని మాట్లాడుతూ ఆస్తుల నిర్వహణకు పారదర్శకమైన విధానం ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సరళీకృత విధానాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని దీంతో పేదలకు సామాన్యులకు రైతులకు మరింత ఊరట లభించనుందని అన్నారు. ఈ నూతన ఉత్తర్వులు గతంలో జారీ చేసిన పాత సర్క్యులర్లు అన్నింటినీ రద్దు చేయడంతో పాటు భూ రికార్డుల్లో అక్రమ మార్పులకు ఆస్కారమిచ్చే మాన్యువల్ ఎంట్రీలకు స్వస్తి పలుకుతుందని అన్నారు. వ్యవసాయ భూములకు సంబంధించి 'వెబ్‌ల్యాండ్ 2.0' మాత్రమే ఉంటుందన్నారు. నిషేధిత ఆస్తుల యొక్క ఏకైక సెంట్రలైజ్డ్ మరియు అధికారిక డేటాబేస్ నిర్వహణ ఇక రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ ఐజీ వద్ద ఉంటుందని అన్నారు. 18-06-1954 నాటికి ముందు అసైన్ చేసిన భూములు,సుప్రీంకోర్టు ఉత్తర్వులకు లోబడి దేవాలయాలు లేదా వక్ఫ్ బోర్డుల నుండి చట్టబద్ధంగా వేలంలో కొనుగోలు చేసిన భూములు,విలేజ్ సర్వీస్ ఇనాంలు,షరతులతో కూడిన పట్టా భూములు,పాత కాలంనాటి అన్-అప్రూవ్డ్ లేఅవుట్ల భూములను 22ఏ నిషేధిత జాబితా నుండి పూర్తిగా తొలగిస్తున్నామని అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అలాగే గ్రామకంఠం భూములు ఎట్టి పరిస్థితుల్లోనూ 22ఏలో పెట్టకూడదన్నారు. ఏపీఎస్ఎఫ్సీ వేలంలో కొన్న భూములు 22ఏలో ఉంటే తొలగించాలని కొత్త ఉత్తర్వుల్లో పేర్కొన్నామన్నారు.

నిర్ణిత విస్తీర్ణం మించిన ఆస్థులను నిషేధిత జాబితాలో పెట్టేందుకు ప్రభుత్వమానికే అథారిటి ఉంటుదని గ్రామంలో అయితే ఎకరం,పట్టణాల్లో అయితే వెయ్యి చదరపు గజాలకు మించి ఉంటే రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని మంత్రి సత్యప్రసాద్ స్పష్టం చేశారు. నిషేధిత ఆస్థుల జాబితాలో ఉన్న భూమికి సంబంధించి కోర్టులు ఆదేశాలు ఇస్తే 5 రోజుల లోపు రెవెన్యూ అధికారులకు తెలియపర్చాల్సి ఉంటుందన్నారు. ఏదైనా భూమి పట్టాభూమి కాదు ప్రభుత్వ పరిధిలోకి వచ్చే భూమి అని నిరూపించాల్సిన బాధ్యత ఆ సంబంధిత పౌరులది కాదని ప్రభుత్వానిదేనని అన్నారు. ఏ ఆస్తినైనా 22ఏ లో చేర్చేముందు సబ్ డివిజన్ పూర్తిచేసి భూ యజమానికి డిజిటల్ డెలివరీ,రిజిస్టర్డ్ పోస్ట్,ఇంటికి నోటీస్ అంటించడం ద్వారా ముందస్తు షోకాజ్ నోటీస్ ఇవ్వడం తప్పనిసరి చేశారని తెలిపారు. అభ్యంతరాల సమర్పణకు పౌరులకు 30 రోజుల గడువుతో పాటు లాయర్ల ద్వారా వాదనలు వినిపించడానికి మరో 14 రోజుల ప్రత్యేక సమయం ఇచ్చి విచారణ అనంతరం అధికారి రికార్డుల్లో నమోదయ్యేలా కారణాలతో కూడిన 'స్పీకింగ్ ఆర్డర్' జారీ చేయాల్సి ఉంటుందని వివరించారు. 22ఏ లో భూములను చేర్చే,తొలగించే అధికారాన్ని కేవలం సబ్-కలెక్టర్,ఆర్డీఓ స్థాయి అధికారులకు మాత్రమే పరిమితం చేస్తూ వారి నిర్ణయంపై అభ్యంతరాలుంటే జిల్లా జాయింట్ కలెక్టర్ కి అప్పీల్ చేసుకునేందుకు ఆ తర్వాత ప్రభుత్వానికి రివిజన్ పిటిషన్ దాఖలు చేసుకునేందుకు పారదర్శకమైన అప్పీలు వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ జరుగుతోందంటూ వైసిపి నేతలు చేస్తున్న కుట్రపూరిత ప్రచారాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్రంగా ఖండించారు. పీపీపీ మోడల్ లో ప్రయివేట్ భాగాస్వామి కేవలం భవనాలు, ఆధునిక ఫర్నిచర్,కంప్యూటర్లు,క్యూ మేనేజ్‌మెంట్ వంటి నాన్-స్టాట్యుటరీ మౌలిక వసతుల కల్పనకు మాత్రమే పరిమితమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 297 కార్యాలయాల్లో కేవలం జిల్లా కేంద్రాల్లోని 26 ఆఫీసుల్లో మాత్రమే దీనిని పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేస్తున్నామని తెలిపారు. దస్తావేజుల పరిశీలన, రిజిస్ట్రేషన్లు,స్టాంప్ డ్యూటీ వసూలు,చట్టబద్ధమైన నిర్ణయాధికారాలన్నీ 100 శాతం ప్రభుత్వ సబ్-రిజిస్ట్రార్ పరిధిలోనే ఉంటాయని, డాక్యుమెంట్ రైటర్ల వృత్తికి,వారి కుటుంబాల ఉపాధికి రూపాయి నష్టం కూడా జరగకుండా ప్రభుత్వం సంపూర్ణ రక్షణ కల్పిస్తుందని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం అనామక కంపెనీకి రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను 90 కోట్ల రూపాయలకు అప్పగించాలని ప్రయత్నించిందని అయితే ఆ కంపెనీకి ఉన్న అసమర్ధత కారణంగా వాటిని ఏర్పాటు చేయడంలో విఫలమయిందని అన్నారు. తమ ప్రభుత్వం రెండేళ్ల పాటు అధ్యయనం చేసి ఉత్తమ పద్ధతుల్లో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తుంటే ఆపార్టీ విష ప్రచారం చేస్తోందని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో విజయవంతం అయిన విధానాలను మన రాష్ట్రంలో అమలు చేయటం వల్ల పరిపాలన మరింత సౌలభ్యవంతంగా మారుతుందని, ప్రజలకు పారదర్శకమైన,వేగవంతమైన సేవలు అందుబాటులోకి వస్తాయనే అభిప్రాయం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో అమలు జరుగుతున్న విధానాలను అధ్యాయనం చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో రీ సర్వే పై చేస్తున్న విమర్శల్లో నిజం లేదని మంత్రి అనగాని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రీ సర్వేను తప్పుల తడకగా నిర్వహించిందని ఇప్పటికీ కూడా ఆ తప్పులను సరి చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం రీ సర్వేకు సరైన సమయం ఇవ్వలేదని కానీ కూటమి ప్రభుత్వం పాలనలో రీ సర్వేకు 200కి పైగా రోజులు కేటాయించామని గ్రౌండ్ ట్రూతింగ్ కే 90 రోజులు కేటాయించామని సర్వే అధికారులు వంద రోజుల పాటు గ్రామాల్లోనే ఉండి రీ సర్వేను నిర్వహిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం రీ సర్వేకు కేవలం వంద రోజులు మాత్రమే కేటాయించి తప్పుల తడకగా మార్చిందని తమను కూడా అలాగే చేయమని వైసీపీ నాయకులు చెబుతున్నారా అని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రశ్నించారు.

# రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):**పట్టణంలోని స్థానిక రామలింగేశ్వర పేటలోని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సర్ కార్యక్రమాన్ని పార్టీ బి.ఎల్.ఏ లు బి.ఎల్.ఓ లతో కలిసి బూత్ లెవల్లో పని చేశారని అందువల్ల ఒక అవగాహన వస్తుందని దానితో బూత్ లెవల్ లో పనిని తేలికగా చేయవచ్చని ఆయన తెలియజేశారు. అదేవిధంగా ఈ నెల 27 నుండి 40 రోజుల వరకు ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని ఆయన పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంతమందికి గాను తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేయటం జరుగుతుందని, సూపర్ సిక్స్ లో ఒక్కొక్కటి నెరవేర్చి ప్రజల మన్ననలను. కూటమీ ప్రభుత్వం పొందుతుందని ఎమ్మెల్సీ ఆలపాటి వెల్లడించారు. కార్యక్రమంలో క్లస్టర్, యూనిట్ ఇంచార్జీలు, బూత్ కన్వీనర్లు పార్టీ అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జీవో-3కు మళ్లీ జీవం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బుధవారం విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో రాష్ట్రంలోని 40 గిరిజన సంఘాల ప్రతినిధులు, ఏజెన్సీ ప్రాంత ఎమ్మెల్యేలతో సమావేశమై జీవో-3, 1/70 చట్టం, భూ హక్కులు, విద్య, ఉపాధి, సంక్షేమ పథకాల అమలుపై విస్తృతంగా చర్చించారు.

సమావేశం అనంతరం మంత్రి మాట్లాడుతూ, జీవో-3కు ప్రభుత్వం గానీ, ముఖ్యమంత్రి గానీ ఎప్పుడూ వ్యతిరేకం కాదన్నారు. గిరిజనులకు శాశ్వత న్యాయం జరిగేలా న్యాయస్థానాల్లోనూ నిలిచే బలమైన చట్టాన్ని తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఇందుకోసం 9 ఐటీడీఏల పరిధిలో గిరిజన సంఘాలు, జేఏసీలు, మేధావుల అభిప్రాయాలను సేకరించి సమగ్ర ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

జీవో-3 చరిత్రను ప్రస్తావిస్తూ, 1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు జీవో-275 ద్వారా గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని, 2000లో చంద్రబాబు నాయుడు జీవో-3ను ప్రవేశపెట్టి ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధ్యాయ పోస్టులను స్థానిక గిరిజనులకే కేటాయించేలా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే జీవో-3 సుప్రీంకోర్టులో రద్దయిందని, రివ్యూ పిటిషన్ కూడా దాఖలు చేయకపోవడం గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు.

అమాయక గిరిజన యువతను ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నాయని మంత్రి ఆరోపించారు. అలాంటి ప్రచారాలను విశ్వసించవద్దని, గిరిజనుల హక్కులు, సంక్షేమం, భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం పూర్తి భరోసా ఇస్తుందని హామీ ఇచ్చారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.ఎం. నాయక్, డైరెక్టర్ సదా భార్గవి, ఏజెన్సీ ప్రాంత ఎమ్మెల్యేలు, గిరిజన సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

## విజయవాడలో ఉద్రిక్తత... బీజేపీ, కాంగ్రెస్ శ్రేణుల ఘర్షణ



**విజయవాడ, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్):**విజయవాడలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని విజయటాకీస్ నుంచి కాంగ్రెస్ కార్యాలయం వరకు నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బీజేపీ, కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో ఇరువర్గాలకు చెందిన కార్యకర్తలకు గాయాలయ్యాయి. దీంతో రెండు వర్గాలను పోలీసులు చెదరగొట్టారు. అయితే బీజేపీ శ్రేణుల తీరును కాంగ్రెస్ కార్యకర్తలు తప్పుబట్టారు. శాంతియుతంగా నిరసనలు తెలపాలి కానీ తమ పార్టీ కార్యాలయంపై దాడి చేయడమేంటని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## జీఎస్టి ఆడిట్ అసిస్టెంట్ కమిషనర్గా జిట్టా వెంకటేశ్వర్లు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ గా ఐ.ఆర్.ఎస్ అధికారి జిట్టా వెంకటేశ్వర్లు ( జె. వి ) నియమితులయ్యారు. గుంటూరు అరండాలపేట మూడవ లైన్ రెండవ అడ్డరోడ్డు లో నూతనంగా నెలకొల్పిన జీఎస్టీ ఆడిట్ కార్యాలయంలో బుధవారం ఆయన నూతన బాధ్యతలు స్వీకరించారు. ఏ.పి సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ పెన్షనర్స్ అసోసియేషన్ నేతలు పి. వి. సత్యనారాయణ, గుమ్మడి సీతారామయ్యచౌదరి, ఎన్. ఎస్. నగేష్ బాబు, పి. కోటేశ్వరరావు తదితరులు నూతన అసిస్టెంట్ కమిషనర్ కు పుష్పగుచ్చం అందచేసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ జె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కృష్ణా, ఎన్.టి.ఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలలోని జీఎస్టీ రిజిస్టర్డ్ పన్ను చెల్లింపుదారుల అకౌంట్స్, రిటర్న్ల తనిఖీ నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం గుంటూరులో ఆడిట్ సర్కిల్ కార్యాలయంను ఏర్పాటు చేసిందని తెలిపారు. జీఎస్టీ సూపరింటెండెంట్లు, ఇన్స్పెక్టర్లు తో కూడిన ఎనిమిది బృందాలు ప్రతిరోజు, ముందుగా నోటీసు పంపిన పన్ను చెల్లింపుదారుల వ్యాపార రికార్డులు, లావాదేవీల సమగ్రతను పరిశీలిస్తాయన్నారు. పన్ను తేడా లేదా లోపాలు గుర్తిస్తే, పన్ను చెల్లింపుతో పాటు వడ్డీ, జరిమానాతో సహా డిమాండ్ నోటీసు జారీ చేయబడుతుందని వివరించారు. తొలుత అసిస్టెంట్ కమిషనర్ కు జీఎస్టీ అధికారులు, సిబ్బంది ఘనమైన రీతిలో స్వాగతం పలికారు.

# సంజీవని అమలుకు రాష్ట్రవ్యాప్తంగా టెండర్లు

- ఆగస్టు 14 వరకు దరఖాస్తులు.. 5 కోట్ల మంది ఆరోగ్య రికార్డులతో సమీకృత డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫాం



**అమరావతి, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రజలకు సమగ్ర, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన 'సంజీవని' (ఇంటిగ్రేటెడ్ డిజిటల్ కేర్ కోఆర్డినేషన్ అండ్ హెల్త్ కేర్ డెలివరీ సిస్టమ్) పథకం అమలుకు రాష్ట్రవ్యాప్తంగా టెండర్లను ఆహ్వానించింది. ఈ పథకం అమలుకు అవసరమైన సమీకృత డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫాంను రూపొందించి, ఐదేళ్లపాటు నిర్వహించేందుకు సంబంధించిన రిక్వెస్ట్ ఫర్ పార్టిసిపేషన్ (ఆర్ఎఫ్‌పీ)ను బుధవారం ప్రభుత్వం విడుదల చేసింది. వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి ఆర్ఎఫ్‌పీకి ఆమోదం తెలిపిన అనంతరం టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో అమలవుతున్న వివిధ ఆరోగ్య పథకాల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ఆశించిన ఫలితాలు సాధ్యం కావడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు 40 ఆరోగ్య పథకాలను అమలు చేస్తున్నప్పటికీ, అవి విడివిడిగా పనిచేయడం, ప్రజల ఆరోగ్య సమాచారాన్ని సమగ్రంగా విశ్లేషించే వ్యవస్థ లేకపోవడం, రియల్‌టైమ్‌లో వైద్య జోక్యం చేసుకునే అవకాశం లేకపోవడం వంటి కారణాలతో ప్రజలకు పూర్తిస్థాయి ప్రయోజనం అందడం లేదని పేర్కొన్నారు.

ఈ పరిస్థితిని అధిగమించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు సంజీవని పథకాన్ని రూపొందించి, కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా విజయవంతంగా అమలు చేసిన అనంతరం రాష్ట్రంలోని 28 జిల్లాలకు విస్తరిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 5 కోట్లకు పైగా ప్రజల ఆరోగ్య రికార్డులను ఒకే డిజిటల్ వేదికపై నిక్షిప్తం చేసి, వారి ఆరోగ్య చరిత్ర ఆధారంగా వ్యాధులపై ముందస్తు హెచ్చరికలు జారీ చేయడం, వైద్యుల అపాయింట్‌మెంట్లు ఏర్పాటు చేయడం, టెలీ కన్సల్టేషన్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్య సేవలు అందించడం, చికిత్స పురోగతిని నిరంతరం పర్యవేక్షించడం వంటి సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు.

డిజిటల్ ప్లాట్‌ఫాం ఆధారంగా పనిచేసే ఈ వ్యవస్థ వల్ల మారుమూల ప్రాంతాల ప్రజలకు కూడా నాణ్యమైన వైద్య సేవలు చేరువవుతాయని, వ్యాధి గుర్తించిన దశ నుంచి పూర్తిగా కోలుకునే వరకు నిరంతర పర్యవేక్షణ (కంటిన్యూమ్ ఆఫ్ కేర్) అందించబడుతుందని మంత్రి తెలిపారు. ప్రజలు వైద్య ఖర్చుల కోసం స్వంతంగా చేసే వ్యయాన్ని తగ్గించడంతో పాటు, వ్యాధులను ముందుగానే గుర్తించి నివారించే దిశగా సంజీవని కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని పేర్కొన్నారు.

సంజీవని పథకం పరిధిలో తల్లి-శిశు ఆరోగ్యం, పునరుత్పత్తి ఆరోగ్యం, సంక్రమిక, అసంక్రమిక వ్యాధులు, మానసిక ఆరోగ్యం, దంత వైద్యం, నేత్ర, ఈఎన్‌టీ సేవలు, ట్రామా కేర్, ఉపశమన వైద్యం, వృద్ధుల ఆరోగ్యం, నిర్ధారణ పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ తదితర 12 ప్రధాన ఆరోగ్య విభాగాలను సమగ్రంగా అనుసంధానించనున్నారు. ఆయా పథకాల ద్వారా లభించే సమాచారాన్ని ఒకే వేదికపై సమీకరించి అవసరమైన సమయంలో వైద్యపరమైన జోక్యం చేసుకునే విధంగా డిజిటల్ వ్యవస్థను రూపొందించనున్నారు.

డిజిటల్ వైద్య సేవల రంగంలో అనుభవం ఉన్న భారతీయ సంస్థలు టెండర్లలో పాల్గొనవచ్చని ప్రభుత్వం తెలిపింది. జాతీయ, రాష్ట్ర ఆరోగ్య పథకాల అమలులో గత మూడేళ్ల అనుభవం ఉండాలని స్పష్టం చేసింది. క్యూసీబీఎస్ విధానంలో టెండర్ల ఎంపిక జరుగుతుందని, సాంకేతిక సామర్థ్యానికి 70 శాతం, ఆర్థిక ప్రతిపాదనకు 30 శాతం వెయిటేజ్ ఇవ్వనున్నట్లు ఆర్ఎఫ్‌పీలో పేర్కొంది.

టెండర్ల షెడ్యూల్ ప్రకారం జూలై 27న ప్రీ-బిడ్ సమావేశం, జూలై 31న సందేహాల నివృత్తి, ఆగస్టు 14 వరకు టెండర్ల దాఖలు, ఆగస్టు 19న సాంకేతిక బిడ్ల పరిశీలన, ఆగస్టు 31న ఆర్థిక బిడ్ల మదింపు, సెప్టెంబర్ 7న తుది ఎంపిక ప్రక్రియ పూర్తికానుంది.

## ఉద్యోగులకు ప్రభుత్వం భరోసా

(మొదటి పేజీ తరువాయి)

క్రోడీకరించి ముఖ్యమంత్రి వర్యుల దృష్టికి తీసుకువెళ్ళి సాధ్యమైనంత వం-కూ ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధానంగా వేతన సవరణ కమీషన్ ను ఏర్పాటు, ఐఆర్ ప్రకటన, పెండింగ్ డిఏలు, ఇతర పెండింగ్ బిల్లులు సకాలంలో చెల్లించాలనే డిమాండ్లు అన్ని ఉద్యోగ సంఘాల నుండి వచ్చాయని వాటన్నిటినీ ముఖ్యమంత్రి వర్యుల దృష్టికి తీసుకువెళ్ళి సానుకూలంగా పరిష్కారం అయ్యేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఉద్యోగులు వేరు ప్రజా ప్రతినిధులు వేరు కాదని ఇరువురు కలిసి పని చేస్తేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని అన్నారు. ఉద్యోగులపై చేసే ఖర్చును ప్రభుత్వం భారంగా పరిగణించడం లేదని పెట్టుబడిగానే భావించడం జరుగుతోందని మంత్రి పయ్యావుల పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూల ధృక్పదంతోనే కంట్రిబ్యూటరీ ఫెన్సన్ స్కీమ్ నుండి ఓల్డ్ ఫెన్సన్ స్కీమ్ కు మార్చిందని అన్నారు. అదే విధంగా వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు కూడా 60 నుండి 62 సంవత్సరాలకు పదవీ విరమణ వయస్సును పెంచిందని చెప్పారు.

ఈ సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యం కుటుంబ సంక్షేమం మరియు వైద్య విద్యా శాఖామాత్యులు సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖా మాత్యులు అనగాని సత్యప్రసాద్ లు పాల్గొనగా, రాష్ట్ర ఆహార పౌర సరఫరాలు, వినియోగ దారుల వ్యవహారాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ వర్చువల్ గా పాల్గొన్నారు. ఇంకా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు శశి భూషణ్ కుమార్, యంటి. కృష్ణబాబు, ముఖ్య కార్యదర్శి ఎస్. సురేశ్ కుమార్, కార్యదర్శులు వాడ్రేవు వినయ్ చంద్, వీరపాండ్యన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

అదే విధంగా ఉద్యోగ సంఘాల తరపున ఎపి ఎన్జిజిఓ సంఘం అధ్యక్షులు విద్యాసాగర్, ఎపి సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి.రామకృష్ణ, ఎపి రెవెన్యూ సర్వీసెస్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కె.సూర్యనారాయణ, ఎస్టియు ఎపి అధ్యక్షులు సాయి శ్రీనివాస్, ఎపి యుటిఎఫ్ ఎన్. వెంకటేశ్వర్లు, ఎపి పిఆర్టియు ఎం.కృష్ణయ్య, ఎపిటిఎఫ్ జి.హృదయరాజు, ఎపి ఉపాధ్యాయ సంఘం ఎస్.బాలాజి, ఎపి పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ పి.దామోదర రావు, ఎపి టైపిస్ట్స్ అండ్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ గోపాల కృష్ణ, ఎపి గవర్నమెంట్ వెహికల్ డ్రైవర్స్ అసోసియేషన్ ఎస్.శ్రీనివాసరావు, ఆల్ ఆంధ్రా క్లాస్ 4 సెంట్రల్ అసోసియేషన్ ఎన్.చంద్ర శేఖర్, ఆల్ ఆంధ్రా క్లాస్ 4 సెంట్రల్ అసోసియేషన్ ఎస్.మల్లేశ్వరరావు, ఎపి పిటిడి యూనియన్ మజ్దూర్ యూనియన్ వై.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

## బీసీ విద్యకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే విద్యా సంవత్సరంలో మరిన్ని బీసీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయబోతున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థల సీట్ల కంటే ఎంజేపీ గురుకులాల సీట్లకే డిమాండ్ ఎక్కువ ఉందన్నారు. తమ ఇళ్ల ముందు రోడ్లు కూడా వేసుకోని వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం నసనకోట మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల జూనియర్ కళాశాలను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. నసన్నకోట బీసీ బాలికల గురుకుల పాఠశాల ఏర్పాటుకు దివంగత నాయకులు పరిటాల రవి తన సొంత భూమి పది ఎకరాలను అందజేశారన్నారు. పరిటా రవి సేవా స్ఫూర్తి ఎందరికో మార్గదర్శకమన్నారు. నసన్నకోట బీసీ బాలికల గురుకుల పాఠశాలను తన సొంత నిధులు ఎమ్మెల్యే పరిటాల సునీత అభివృద్ధి చేస్తున్నారన్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీల విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందన్నారు. బీసీ బిడ్డలకు నాణ్యమైన విద్య, ఆహారం, రక్షణ కల్పిస్తోందన్నారు. బీసీ గురుకులాలు, హాస్టళ్లలో సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తరగతి గదులు, విశ్రాంతి గదుల్లో దోమలు చొరబడకుండా దోమ తెరలు ఏర్పాటు చేశామన్నారు. రుచికరమైన భోజనం అందించేలా సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

**ఎంజేపీ సీట్లకే డిమాండ్ ఎక్కువ :** అన్న ఎన్టీఆర్ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా గురుకుల విద్య నాంది పలికారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలను, కళాశాలలను విస్తృతంగా ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన 2014 నాటికి నవ్యాంధ్రప్రదేశ్ లో కేవలం 32 బీసీ గురుకులాలు మాత్రమే ఉండేవన్నారు. 2014-19 మధ్య 75 బీసీ గురుకులాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో కొత్తగా మరో కొత్తగా పది ఎంజేపీ స్కూళ్లను ప్రారంభించామన్నారు. వాటిలో అయిదు రాయలసీమలోనూ, మరో అయిదింటిని ఉత్తరాంధ్రలోనూ ఏర్పాటు చేశామన్నారు. వాటితో పాటు ఆరు బాలిక బీసీ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశద్రోహ శక్తులకు కాంగ్రెస్ అండ

- ప్రధాని నివాసంపై దాడి యత్నం దేశంపైనే దాడి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్
- విజయవాడలో బిజెపి భారీ ర్యాలీ
- కాంగ్రెస్ కార్యాలయాన్ని ముట్టడించి న బిజెపి శ్రేణులు



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** నీట్ పరీక్ష అంశంపై ప్రారంభమైన ఢిల్లీ నిరసనలు దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నించే స్థాయికి చేరుకున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ ఆరోపించారు. నిరసన ర్యాలీ లో మాధవ్ మీడియా తో మాట్లాడుతూ దేశ వ్యతిరేక శక్తులకు కాంగ్రెస్ పార్టీ ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు ఇస్తోందని విమర్శించారు. విజయవాడలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఢిల్లీలో సోనమ్ వాంగ్చుక్ చేపట్టిన నిరసనల్లో అర్బన్ నక్సల్స్, దేశ విద్రోహ శక్తులు చొరబడ్డాయని మాధవ్ ఆరోపించారు. ఆర్టికల్-370 రద్దును వ్యతిరేకించడం, పార్లమెంట్ దాడి కేసు నిందితుడు అఫ్జల్ గురు ఉరితీతను ప్రశ్నించడం, దేశాన్ని ముక్కలు చేస్తామంటూ నినాదాలు చేసే శక్తులకు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు అండగా నిలవడం అత్యంత ప్రమాదకరమని అన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ నివాసంపై దాడి యత్నం దేశంపైనే జరిగిన దాడిగా భావిస్తున్నామని మాధవ్ పేర్కొన్నారు. దీనికి నిరసనగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కార్యాలయాల ముట్టడికి బీజేపీ పిలుపునిచ్చిందన్నారు. విజయవాడలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీజేపీ కార్యకర్తలపై కాంగ్రెస్ శ్రేణులు గుడ్లతో, కర్రలతో దాడి చేయడం వారి హింసాత్మక రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు.

మన్మోహన్‌సింగ్ ప్రభుత్వ హయాంలో 150కు పైగా పేపర్ లీకులు జరిగిన విషయాన్ని కాంగ్రెస్ మరచిపోయిందని విమర్శించారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఘటన వెలుగులోకి రాగానే బాధ్యులపై మోదీ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని అరెస్టులు చేసిందన్నారు. పరీక్షల నిర్వహణ పూర్తై, ర్యాంకు కార్డులు జారీ చేసి కౌన్సెలింగ్ ప్రక్రియ కూడా కొనసాగుతోందని తెలిపారు.

రాహుల్ గాంధీ దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని మాధవ్ ఆరోపించారు. దేశద్రోహ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దేశ సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీజేపీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.

PVN మాధవ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఆధ్వర్యంలో ర్యాలీ గా బయలు దేరి ప్లే కార్డ్ లు ప్రదర్శిస్తూ ఏలూరు రోడ్డులో నినాదాలు చేస్తూ హోరెత్తించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి చేరుకోగానే కాంగ్రెస్ కు చెందిన కొందరు కర్రలతో దాడి కి పాల్పడ్డారు ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీ రాం కాంగ్రెస్ దాడి ని అడ్డుకున్నారు. ర్యాలీ ని అడ్డుకునే ప్రయత్నం లో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్ పై ఎస్సై భౌతిక దాడి కి ప్రయత్నం చేశారు

చైతన్య శర్మ తదితరులు పై కాంగ్రెస్ గూండాలు దాడి కి ప్రయత్నం చేసాయి . రాష్ట్ర కార్యదర్శులు భోగి రెడ్డి ఆదిలక్ష్మి, బొడ్డు నాగలక్ష్మి, రాష్ట్ర అధికార ప్రతినిధి లు ముళ్ళపూడి రేణుక, షేక్ బాజీ, చిరువోలు బుచ్చి రాజు బిజెపి రాష్ట్ర కార్యాలయం ఇంఛార్జి ఉప్పలపాటి శ్రీనివాసరాజు , కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, కరినాగలక్ష్మి ,రవీంద్ర రెడ్డి , షర్మిళ, స్వాతిరావు, ఆర్ముగం, కోలవల్లి గణేష్, పిట్టల గోవిందు, చైతన్య శర్మ, నామిశెట్టి వెంకట్, పోతంశెట్టి నాగేశ్వరరావు, తరుణ్ కాకాని, నున్న కృష్ణ, అవ్వారు బుల్లబ్బాయి, కృష్ణారెడ్డి, పైలా సురేష్, పోతిన బేసు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రుల కమిటీ సమావేశం అసంతృప్తినిచ్చింది: ఏపీటీఎఫ్

- ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై స్పష్టమైన హామీలు ఇవ్వలేదని విమర్శ

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):**వెలగపూడి సచివాలయంలో బుధవారం మంత్రుల బృందం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలతో నిర్వహించిన సమావేశం ఆశించిన ఫలితాలు ఇవ్వలేదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్. చిరంజీవి తెలిపారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆరోగ్య శాఖ మంత్రి సత్యప్రసాద్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని ప్రసాద్, ఆన్‌లైన్ ద్వారా పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్న సమావేశంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌కు చెందిన 21 ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించి, 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని కోరారు. పెండింగ్ ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్, డీఏ బకాయిలు విడుదల చేయడంతో పాటు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు, పంచాయతీరాజ్ పాఠశాలల్లో కారుణ్య నియామకాలు, ఏపీ--తెలంగాణ మధ్య ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలపై పేస్లిప్‌లు జారీ చేయడం, ఎంటీఎస్ టీచర్ల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచడం, సమగ్ర, కేజీబీవీ, మున్సిపల్, ఎయిడెడ్, మోడల్ స్కూల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సమావేశం ముగింపులో ఉద్యోగ సంఘాలు ప్రస్తావించిన అన్ని అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఆర్థిక మంత్రి తెలిపారని ఏపీటీఎఫ్ పేర్కొంది. అయితే ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు, ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన సమస్యలపై స్పష్టమైన పరిష్కార హామీ ఇవ్వకపోవడంతో ఉద్యోగ వర్గాల్లో అసంతృప్తి నెలకొందని ఏపీటీఎఫ్ నాయకత్వం వెల్లడించింది

## ఎమ్మెల్సీ ఆలపాటి చొరవతో సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి కందలం ప్రసన్నకు రూ. 48,823 ఆర్థిక సాయం మంజూరైంది. తెనాలి టీడీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవతో ఈ సాయం అందినట్లు పార్టీ నాయకులు తెలిపారు.

మంజూరైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) మేరకు బుధవారం రూ. 48,823 విలువైన చెక్కును లబ్ధిదారునికి అందజేశారు. వైద్య అవసరాల సమయంలో ప్రభుత్వం అందించిన ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడుతుందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అర్హులైన వారికి సాయం అందించేందుకు కృషి కొనసాగుతుందని నాయకులు తెలిపారు.

## భోగాపురం వేడుకకు యంత్రాంగం సిద్ధం



**అమరావతి, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్):** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వం బుధవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించింది. ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 1న ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని మంత్రులు అధికారులను ఆదేశించారు.

సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు, ఉన్నతాధికారులు, శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, మన్యం జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రజల సమీకరణ, రవాణా సౌకర్యాలు, పార్కింగ్, తాగునీరు, ఆహార పంపిణీ, ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రారంభోత్సవాన్ని ప్రజల పండుగగా నిర్వహించేలా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా అరకు గిరిజనుల సంప్రదాయ థింసా నృత్య ప్రదర్శనతో పాటు ఉత్తరాంధ్ర సంస్కృతిని ప్రతిబింబించే కళారూపాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ఆగస్టు 1న కార్యక్రమం ఉండటంతో అదే రోజున పంపిణీ చేయాల్సిన సామాజిక భద్రతా పింఛన్లను ముందుగానే పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. అలాగే ఈ నెల 28న జరగనున్న సింహాచలం గిరి ప్రదక్షిణను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్, భద్రత, ఇతర పరిపాలనా ఏర్పాట్లను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు.

సమీక్ష సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పి. నారాయణ, పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, గుమ్మిడి సంధ్యారాణి, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టీ. కృష్ణబాబు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర యాదవ్, సత్యనారాయణ రాజు, హరి ప్రసాద్, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వంగపల్లి పీఏసీఎస్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం..

### - పాల్గొన్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**యాదాద్రి భువనగిరి, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలక వర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం రోజున ఘనంగా నిర్వ హించారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్. , ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పిఎసిఎస్ చైర్మన్ నెమ్మాని సుబ్రహ్మణ్యం , పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం చైర్మన్ నెమ్మాని సుబ్రహ్మణ్యంను పిఎసిఎస్ కార్యాలయ చైర్మన్ కుర్చీలో కూర్చో బెట్టి , పదవీ బాధ్యతలను అధికారికంగా స్వీకరింప జేశారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య నూతన చైర్మన్‌ను శాలువాతో సన్మానించి , రైతులకు అంకిత భావంతో సేవలందించాలని ఆకాంక్షించారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటివని అన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు , ఎరువులు , పంట రుణాలు , ధాన్యం కొనుగోలు , వ్యవ సాయానికి సంబంధించిన అన్ని సేవలను పార దర్శకంగా అందించడంలో పిఎసిఎస్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని , ముఖ్యమంత్రి నాయకత్వంలో రైతు సంక్షేమం , గ్రామీణా భివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రజా సంక్షేమ పాలన కొన సాగుతోందని అన్నారు.రైతులకు అవసరమైన సౌకర్యాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని , సహకార సంఘాలు రైతులకు మరింత చేరువై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ప్రజలకు పారదర్శకమైన , జవాబు దారీతనంతో కూడిన పాలన అందించడ మే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని , ప్రతి గ్రామంలో అభివృద్ధి ఫలాలు అందేలా ప్రభుత్వం నిరంతరం పని చేస్తోందని బీర్ల అయిలయ్య తెలిపారు.

## ధర్మారెడ్డిపల్లి కాలువకు సాగునీటి విడుదల

### - రైతుల చిరకాల కల నెరవేరింది

### - నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**యాదాద్రి భువనగిరి, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్) :** భువనగిరి నియోజకవర్గ రైతాంగం చిరకాలంగా ఎదురుచూస్తున్న శుభ ఘడియ ఆవిష్కృత మైంది. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో ఉన్న సంగెం-ధర్మారెడ్డిపల్లి కాలువలో ప్రభుత్వ విప్ , నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశం , భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి లతో కలిసి మంగళ వారం రోజు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కాలువ వద్ద ప్రత్యేక పూజలు నిర్వ హించి నీటిని విడుదల చేసిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ దాదాపు రూ.125 కోట్ల వ్యయంతో చేపట్టిన ధర్మా రెడ్డిపల్లి కాలువ నిర్మాణ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 16 నెలల్లోనే సగానికి పైగా పూర్తి చేసి , రైతులకు సాగు నీటిని అందించే స్థాయికి తీసుకు వచ్చిందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టుకు తమ ప్రభుత్వం వేగం తీసుకొచ్చి రైతుల చిరకాల ఆకాంక్ష ను నెరవేర్చిందన్నారు.ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు నాటికి ధర్మా రెడ్డిపల్లి కాలువ నిర్మాణాన్ని పూర్తిస్థాయి లో పూర్తి చేసి , రైతులకు శాశ్వతంగా సాగునీటిని అందుబాటులోకి తీసుకు వస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాలువ పూర్తయిన అనంతరం వేలాది ఎకరాలకు సాగు నీరు అందడంతో వ్యవసాయ ఉత్పత్తి పెరగడమే కాకుండా రైతుల ఆర్థికాభివృద్ధికి ఇది ఎంతో దోహద పడుతుందని పేర్కొన్నారు. విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోం దన్నారు. ధర్మారెడ్డి పల్లి కాలువలో నీటి విడుదలతో ఈ ప్రాంత రైతుల చిరకాల నిరీక్షణకు తెర పడిందని , కాలువ పూర్తయిన తర్వాత ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మండల , గ్రామాల ప్రజా ప్రతి నిధులు , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ,కార్యకర్తలు ,అధికారులు , రైతులు , ఇరిగేషన్ ఈఈ , డిఈ గ్రామస్థులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి ప్రమాదాలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి

### - జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్



**యాదాద్రి భువనగిరి, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్) :** జాతీయ రహదారుల పై ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ అన్నారు. మంగళవారం రోజు హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయం నుండి రవాణా శాఖ కమీషనర్ ఇలంబర్తి , శాంతి భద్రతల అధికారులు , రవాణా , రహదారి భవనాలు , జాతీయ రహదారుల శాఖల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు , పోలీసు ఉన్నతా ధికారులు , రవాణా , రహ దారులు భవనాల శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని జాతీయ రహదారుల పై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం జాతీయ రహదారులపై ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని , జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశాలు ప్రతినెల నిర్వహించాలని తెలిపారు. టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని , జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలు , బ్లాక్ స్పాట్ లను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని అంబులెన్స్ లను అందు బాటులో ఉంచాలని తెలిపారు. ప్రమాదాలు జరిగిన వెంటనే క్షత గాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని , రహదారి భద్రతపై వాహన దారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వాహనదారులు తప్ప కుండా సీట్ బెల్ట్ , హెల్మెట్ ధరించేలా చర్యలు తీసు కోవాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లడుతూ జిల్లాలోని జాతీయ రహదారుల పై ప్రమాదాల నివారణకు అధికారుల సమన్వయం తో చర్యలు తీసు కుంటున్నామని తెలిపారు. రోడ్డు భద్రత కింద జారీ చేసిన ఆదేశాలను జిల్లాలో పక్కాగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ కలెక్టర్ కృతిక , జిల్లా రవాణా శాఖ అధికారి నరేష్ , ఆర్ అండ్ బి అధికారి సరిత పాల్గొన్నారు.

## స్త్రీనిధి సోషల్ ఆడిట్‌లో రూ.6.73 లక్షల దుర్వినియోగం



**గరిడేపల్లి, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్) :** గరిడేపల్లి మండలం కల్మల్ చెరువు వీఓ-1 పరిధిలో స్త్రీనిధి నిధుల వ్యవహారంలో జరిగిన అవకతవకలు సోషల్ ఆడిట్‌లో వెలుగులోకి వచ్చాయి. గత రెండు రోజులుగా నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో సంఘాల లెక్కలను క్షుణ్ణంగా పరిశీలించగా రూ.6.73 లక్షల నిధులు దుర్వినియోగమైనట్లు అధికారులు గుర్తించారు.సీఆర్‌పీ ఎండీ రషీదా ఆధ్వర్యంలో 12 సంఘాల సమావేశాలు నిర్వహించి మొత్తం రూ.14,45,478 విలువైన లావాదేవీలను పరిశీలించారు. ఈ సందర్భంగా గతంలో వీఓ-1లో వీఓఏగా పనిచేసిన అమరావరపు సైదులు, సంఘ సభ్యులు చెల్లించిన రూ.6,73,134ను సభ్యుల ఖాతాలకు జమ చేయకుండా వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు సోషల్ ఆడిట్ సమావేశంలో అంగీకరించినట్లు అధికారులు తెలిపారు.అదేవిధంగా మిగిలిన రూ.7,72,344 సంఘ సభ్యుల వద్ద ఉన్నట్లు లెక్కల్లో తేలిందని పేర్కొన్నారు. దుర్వినియోగమైన నగదును తిరిగి చెల్లించేందుకు మాజీ వీఓఏ అమరావరపు సైదులు, సంఘ బంధం ఓబీ సభ్యులకు మూడు విడతల్లో మొత్తం నగదును చెల్లిస్తానని బాండ్ పత్రం రాసి ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అధికారులు ఈ వ్యవహారంపై తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సోషల్ ఆడిట్ కార్యక్రమంలో స్త్రీనిధి ఆర్‌ఎం శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ జ్యోతి, సీసీ సైదులు, అధ్యక్షురాలు ఎల్లమ్మ, ప్రస్తుత వీఓఏ ధనలక్ష్మి, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత చర్యలను పకడ్బందీగా అమలు చేయాలి





**మంచిర్యాల, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్) :** సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల మేరకు జిల్లాలో రోడ్డు భద్రతకు సంబంధించిన అన్ని చర్యలను సమర్థవంతంగా అమలు చేసి రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశానికి డి.సి.పి. ఎ.భాస్కర్, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పని చేయాలని తెలిపారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై అనుమతించిన లే-బైలు, వే-సైడ్ సౌకర్య కేంద్రాలు మినహా ఇతర ప్రాంతాలలో భారీ, వాణిజ్య వాహనాల పార్కింగ్‌ను పూర్తిగా నిషేధిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. దాబాలు, హోటళ్లు, వాణిజ్య సంస్థల సమీపంలో అక్రమంగా నిలిపే భారీ వాహనాల వల్ల ప్రమాదాలు పెరుగుతున్నందున ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, రహదారులపై ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడ వీధి దీపాలు, సి.సి కెమెరాలు, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, స్పీడ్ కంట్రోల్ చర్యలు, రంబుల్ స్ట్రిప్‌లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ఇందారం వంతెన నుంచి గోదావరి వంతెన వరకు వీధి దీపాల ఏర్పాటు, ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నిర్వహణ, యూ-టర్న్‌ల పున: వ్యవస్థీకరణ, రహదారుల షోల్డర్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు.రహదారుల పర్యవేక్షణ కోసం అధునాతన ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థ, జి.పి.ఎస్. ఆధారిత నిఘా వ్యవస్థలను వినియోగించి ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించి ఈ-చలాన్ వ్యవస్థతో అనుసంధానం చేయాలని, అత్యవసర పరిస్థితులలో తక్షణ వైద్య సేవలు అందించేందుకు ప్రతి 75 కిలోమీటర్లకు అంబులెన్స్, రికవరీ వాహనం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారి హక్కు పరిధిలో కొత్త దాబాలు, వాణిజ్య నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని, ఇప్పటికే ఉన్న అనధికార నిర్మాణాలను తొలగించి రహదారుల భద్రతకు ఆటంకం కలిగించే ఆక్రమణలను నివారించాలని సూచించారు. రహదారుల సమీప భూవినియోగాన్ని నిబంధనల ప్రకారం నియంత్రించి ప్రమాదాలకు దారితీసే పరిస్థితులను అరికట్టాలని అధికారులకు సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణాలలో రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజలలో బాధ్యత పెంపొందించాలని తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని తెలిపారు.మంచిర్యాల డి.సి.పి. భాస్కర్ మాట్లాడుతూ రహదారి భద్రతను మరింత బలోపేతం చేసేందుకు పోలీసు, రవాణా శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక హైవే సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేసి 24 గంటల పర్యవేక్షణ నిర్వహిస్తామని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, ఓవర్‌లోడ్ వాహనాలు, అక్రమ పార్కింగ్ వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై నిరంతర డ్రైవ్‌లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రాహ్ వీర్ పథకం గురించి ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలని సూచిస్తూ, రోడ్డు ప్రమాద బాధితులను ప్రమాదం జరిగిన తొలి గంటలో సమీప ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వ్యక్తులకు కేంద్ర ప్రభుత్వం నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రం అందజేస్తుందని తెలిపారు. ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ప్రజలు భయపడకుండా ముందుకు రావాలని, సమయానికి అందించే సహాయం అనేక ప్రాణాలను కాపాడ గలదని తెలిపారు.ఈ కార్యక్రమంలో రవాణా, జాతీయ రహదారుల, రోడ్ల భవనాల, పోలీసు శాఖల అధికారులు, మున్సిపల్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నూతన ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభోత్సవం

### - జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

### - విద్యార్థులతో మమేకమై బస్సు నడిపిన ఎమ్మెల్యే





**యాదాద్రి భువనగిరి, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్) :** 1718భువనగిరి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో భువనగిరి నుండి టేకులసోమారం వయా నమాత్‌పల్లి వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసును మంగళవారం రోజు భువనగిరి నియోజక వర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గత 25 సంవత్సరాలుగా బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నమాత్ పల్లి గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ బస్సు సర్వీసు ఏర్పాటు కోసం ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి గ్రామస్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యేని ఘనంగా శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం టేకులసోమారం ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కి ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానం చేసి కృతజ్ఞతలు తెలియ జేశారు. నూతన ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం తో విద్యార్థులు సకాలంలో పాఠశాలకు చేరుకునే అవకాశం కలిగిందని , గ్రామ ప్రజలకు కూడా ఎంతో మేలు జరుగు తుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా ఆర్టీసీ బస్సు ను నడిపి ప్రారంభోత్స వానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం భువనగిరి నుండి టేకులసోమారం వరకు బస్సులో ప్రయాణించి ప్రయాణికులతో మమేక మయ్యారు.

ఈ నూతన బస్సు సర్వీసు ద్వారా మార్గ మధ్యంలోని గ్రామాల ప్రజలు , విద్యార్థులు , ఉద్యోగులు మరియు ప్రయాణికులకు సౌకర్యవంతమైన ,

రవాణా సేవలు అందు బాటులోకి వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పట్టణ , మండల , గ్రామ ప్రజాప్రతినిధులు , ఆర్టీసీ డిఎం సురేష్ మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## చెరువు భూముల సర్వేపై ఉద్రిక్తత

### - హుజూర్ నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహిళల ఆందోళన..

### - ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్..



**హుజూర్‌నగర్,జూలై 22(జర్నలిస్ట్ ఫైల్) :** హుజూర్‌నగర్ పట్టణంలోని చెరువు భూముల సర్వే వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసింది. కోర్టు ఆదేశాల మేరకు చెరువు భూముల సర్వే నిర్వహించి నోటీసులు జారీ చేయడంతో బాధిత మహిళలు, స్థానికులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. పట్టణంలోని 240 సర్వే నంబర్ పరిధిలో ఉన్న సుమారు 72 ఎకరాల 31 గుంటల చెరువు భూమిని అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో ఊర చెరువు కింద నివాసం ఉంటున్న 115 కుటుంబాలకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేశారు. తమ ఇళ్లలో కొంత భాగం చెరువు భూమిలోకి వస్తోందని తెలిసి స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. తాము ఎన్నో ఏళ్లుగా అక్కడే నివసిస్తున్నామని, తమను ఖాళీ చేయించే ముందు ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలాలు లేదా ఇళ్లు ఇప్పించాలని వారు అధికారులను కోరారు.

ఆందోళన సందర్భంగా మహిళలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ, తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. చెరువు భూముల సమస్యను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ విషయంపై హుజూర్‌నగర్ తహసీల్దార్ బండ కవిత మాట్లాడుతూ, కోర్టు ఉత్తర్వుల మేరకే అధికారులు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో సమగ్ర సర్వే నిర్వహించి చెరువు సరిహద్దులను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఆ సర్వే నివేదిక ఆధారంగానే నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసినట్లు స్పష్టం చేశారు. ఇందులో అధికారుల స్వతంత్ర నిర్ణయం ఏదీ లేదని, కోర్టు ఆదేశాలను అమలు చేయడం తమ బాధ్యత అని తెలిపారు.కోర్టు ఆదేశాల మేరకు సర్వే ప్రక్రియ కొనసాగుతుండగా, బాధిత కుటుంబాల భవిష్యత్తుపై స్థానికంగా చర్చ కొనసాగుతోంది. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

### - ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే అవకాశం.. రైతులకు వ్యవసాయశాఖ సూచన



**మిర్యాలగూడ, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షపాతం, భూగర్భ జలాల లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మిర్యాలగూడ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె. జగదీశ్వర్ రెడ్డి సూచించారు. మిర్యాలగూడ మండలం ఊట్లపల్లి రైతువేదికలో మండల వ్యవసాయ అధికారి ఎం. రుషేంద్రమణి ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పాటు బోర్లలో భూగర్భ జలమట్టాలు పడిపోతున్నాయని తెలిపారు. చెరువులు కూడా పూర్తిస్థాయిలో నిండే పరిస్థితులు కనిపించడం లేదని, చివరి దశలో వర్షాలు కురిసినా చెరువులు పూర్తిగా నిండే అవకాశం తక్కువగా ఉందన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తమ మొత్తం సాగు విస్తీర్ణంలో వరి సాగు చేయకుండా కొంత మేర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల జొన్న, పెసలు, మినుములు, కంది, పొద్దుతిరుగుడు, ఆముదం వంటి పంటలను సాగు చేయడం ద్వారా నీటిని ఆదా చేయడంతో పాటు భవిష్యత్‌లో ఎదురయ్యే సాగునీటి సమస్యల వల్ల కలిగే నష్టాలను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో బోర్లు, చెరువుల ద్వారా నీటి లభ్యత మరింత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు నీటి వనరులను పొదుపుగా వినియోగించు కోవాలని, పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళికను మార్చుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. వరి సాగును కొంత మేర తగ్గించి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్. గోపి, రామచంద్రారెడ్డి, సతీష్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

### - దుర్గానగర్‌లో సెల్‌ఫోన్ టవర్ నిర్మాణం నిలిపివేతకు హామీ



**మిర్యాలగూడ, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బి ఎల్ ఆర్) మరోసారి తన చొరవను చాటుకున్నారు. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని దుర్గానగర్‌లోని కళ్యాణి గోడౌన్స్‌లో ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే రేడియేషన్‌కు కారణమయ్యే సెల్‌ఫోన్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ స్థానిక ప్రజలు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. స్థానిక ప్రజల విజ్ఞప్తిని స్వీకరించిన ఎమ్మెల్యే వెంటనే స్పందించి, గోడౌన్స్ యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రజల ఆరోగ్యానికి ఇబ్బంది కలిగించే విధంగా టవర్ నిర్మాణం చేపట్టవద్దని, నిర్మాణానికి ఇచ్చిన అనుమతులను సైతం రద్దు చేసుకోవాలని యాజమాన్యానికి సూచించారు. ఎమ్మెల్యే సూచనలకు స్పందించిన యాజమాన్యం వెంటనే టవర్ నిర్మాణాన్ని నిలిపివేస్తామని, ఇప్పటికే తీసుకున్న అనుమతులను కూడా రద్దు చేసుకుంటామని హామీ ఇచ్చింది. ప్రజలు తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన వెంటనే స్పందించి పరిష్కరించినందుకు బత్తుల లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రజల ఎమ్మెల్యేగా నిలుస్తున్నారని స్థానికులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎలిమినేటి అంజి, అద్దంకి కొండలు, గుడిసె రాంబాబు, పల్లెర్ల రాజు, చౌడోజు అశోక్, నరేష్, శ్రీను, గోపి, కొండల్, నిర్మల, పద్మతో పాటు గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సర్వ శిక్ష ఉద్యోగుల పోస్ట్‌కార్డు ఉద్యమం ప్రారంభం

### - టైం స్కేల్, సర్వీస్ రెగ్యులరైజేషన్ కోసం సీఎంకు వినతులు



**గరిడేపల్లి, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్) :** గరిడేపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ, ఎంఆర్సీలో పనిచేస్తున్న సర్వ శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మంగళవారం పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. టీఎస్ యుటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు రాష్ట్ర ముఖ్యమంత్రి పేరుతో పోస్ట్‌కార్డులు రాసి తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా టీఎస్ యుటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి మాట్లాడుతూ, కేజీబీవీ, యుఆర్ఎస్, సర్వ శిక్ష ఉద్యోగులకు కనీస టైం స్కేల్ అమలు చేయడంతో పాటు సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని చేపట్టామని తెలిపారు.ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సెలవు సౌకర్యాలు కల్పించాలని, వార్షిక ఇంక్రిమెంట్లు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, కేర్‌టేకర్లను నియమించాలని, సమ్మె కాలపు వేతనాలను వెంటనే చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శైలజ, టీఎస్ యుటీఎఫ్ మండల ఉపాధ్యక్షులు కిషోర్‌బాబు, కుటుంబ సంక్షేమ నిధి కన్వీనర్ రవీందర్, సీనియర్ నాయకులు రాజారావు, రావుల రాంబాబు, రేఖ నరసయ్య, నవీన్‌కుమార్, వెంకటేశ్వర్లు, కేజీబీవీ సిబ్బంది అనురాధ, సుశీల, సుహాసిని, స్వప్న, కవిత, సరిత, జ్యోతి, రజిత, ఎస్ఎస్ఏ ఉద్యోగులు అశోక్, రామకృష్ణ, ఉమా, నాగేంద్ర, మణి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి ముసుగులో వినాశనం, అవినీతి

### : ప్రభుత్వంపై లింగాల కమల్ రాజు ధ్వజం



**మధిర (జర్నలిస్ట్ ఫైల్) :** మధిర నియోజకవర్గంలో అభివృద్ధి పేరిట విధ్వంసం, తీవ్ర స్థాయిలో అవినీతి జరుగుతోందని ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ నాయకులు లింగాల కమల్ రాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నాయకులతో కలిసి మధిర లోని వైరా ఏరు ఒడ్డున నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై, స్థానిక శాసనసభ్యులు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై విమర్శలు గుప్పించారు. అభివృద్ధి నిర్మాణాలు చేపట్టేటప్పుడు నిబంధనల ప్రకారం క్వారీ లేదా నిర్ణీత ప్రాంతాల నుంచి మెటీరియల్ తీసుకు రావాలని. కానీ, కాంట్రాక్టర్లు స్థానిక ఏట్లో నుంచే అక్రమంగా మట్టి, ఇసుకను జేసీబీలతో తోడుతూ నిబంధనలకు విరుద్ధంగా వాడుతున్నారని ఆరోపించారు. రైల్వే బ్రిడ్జ్, సాధారణ బ్రిడ్జిలకు అతి సమీపంలో కొన్ని వందల ట్రిప్పుల ఇసుక, మట్టి తోడేయడం వల్ల భవిష్యత్తులో బ్రిడ్జిల ఉనికికే తీవ్ర ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. వాల్ నిర్మాణం కోసం పట్టా భూములు కోల్పోయిన రైతులకు ఎంతవరకు పరిహారం ఇస్తారో స్పష్టత ఇవ్వకుండా, అడ్డగోలుగా లాభాలు, కమిషన్ల కోసమే ఈ పనులు చేస్తున్నారని మండిపడ్డారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మధిరలో నీటి నిల్వలు పెంచేందుకు, భూగర్భ జలమట్టం పెంచేందుకు కోట్లాది రూపాయలతో చెక్ డ్యామ్ నిర్మించారని తెలిపారు. దానివల్ల మధిరలో తాగునీటి ఎద్దడి తీరిందని, అలాంటి చెక్ డ్యామ్‌ను జేసీబీలతో కూల్చివేసే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. చట్టపరమైన నిబంధనలు పక్కనపెట్టి కాంట్రాక్టర్లకు ఊడిగం చేస్తున్న అధికారులకు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.గత 75 ఏళ్ల కాలంలో చూడని అవినీతిని, అరాచకాన్ని ఈరోజు మధిరలో చూస్తున్నామని, చెక్ డ్యామ్‌కు కానీ, ప్రజల ప్రయోజనాలకు కానీ భంగం వాటిల్లితే బిఆర్ఎస్ పార్టీ ఊరుకోదని, ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు.వైరా ఏటి ఒడ్డున జరుగుతున్న అక్రమ ఇసుక, మట్టి తోడేసే జేసీబీలు, లారీలను వెంటనే నిలిపివేయాలని, పనుల నాణ్యతపై మైనింగ్, ఏడీ అధికారులు వెంటనే క్షేత్రస్థాయికి వచ్చి తనిఖీలు చేపట్టాలని బిఆర్ఎస్ పార్టీ తరపున ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సీతలా భవాని పండుగ వేడుకలు



**మధిర, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్) :**

బంజారా సమాజ ఆరాధ్య దైవమైన శ్రీ సీతలా భవాని పండుగను మండల పరిధిలోని వంగవీడు తండాలో మంగళవారం భక్తిశ్రద్ధలతో,సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు.బంజారా సంప్రదాయం ప్రకారం ఆషాఢ మాసంలో తొలకరి వర్షాలు కురిసి వ్యవసాయ పనులు ప్రారంభమైన అనంతరం ఈ పండుగను నిర్వహించడం ఆనవాయితీ. గ్రామంలో సకాలంలో వర్షాలు కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని, పశుసంపద వృద్ధి చెందాలని, గ్రామ ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు శ్రీ సీతలా భవాని అమ్మవారిని ప్రార్థించారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, మొక్కుబడులు, సంప్రదాయ ఆచారాలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయ బంజారా వేషధారణలో భక్తి గీతాలు ఆలపించగా, పురుషులు డప్పు వాయిద్యాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం గ్రామ శ్రేయస్సు, వ్యవసాయాభివృద్ధి, ప్రకృతి అనుగ్రహం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.పండుగలో తండా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బంజారా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలను విజయవంతంగా నిర్వహించారు..

## అభివృద్ధిని అడ్డుకోవడమే బీఆర్ఎస్ లక్ష్యం



**మధిరటౌన్, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్) :**

మధిరలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడ్డుకోవడమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుందని, అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారనికాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్ మండిపడ్డారు. మంగళవారం మధిర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూమధిర బ్రిడ్జికి సుమారు 200 మీటర్ల దూరంలో వైరా నది లో పేరుకుపోయిన మట్టిదిబ్బలను తొలగించే పనులు రిటైనింగ్ వాల్ నిర్మాణంలో భాగంగా సాంకేతిక నిపుణుల సూచనల మేరకే జరుగుతున్నాయని తెలిపారు. నది ప్రవాహం సజావుగా కొనసాగేందుకు, నిర్మాణ పనులు సురక్షితంగా పూర్తి కావడానికి ఈ పనులు అత్యంత అవసరమని చెప్పారు. ప్రతి చిన్న అభివృద్ధి పనిని కూడా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కని లక్ష్యంగా చేసుకుని విమర్శించడం బీఆర్ఎస్ నాయకుడు కమల్ రాజ్ కు అలవాటుగా మారిందని విమర్శించారు. వాస్తవాలు తెలుసుకోకుండా రాజకీయ లబ్ధి కోసం అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు.రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన ఇసుకను ప్రభుత్వం ఇచ్చిన అనుమతుల మేరకే వైరా నది నుంచి వినియోగిస్తున్నారని, నిర్మాణ పనులకు అవసరమైన ఇసుకను అక్కడే ఉపయోగిస్తున్నారే తప్ప ఎలాంటి అక్రమ ఇసుక తరలింపు జరగడం లేదని స్పష్టం చేశారు. ఆధారాలు లేకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేయడం రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మధిర అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఓర్వలేక ప్రతి పనిలోనూ అడ్డంకులు సృష్టిస్తూ చౌకబారు రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజల కోసం జరుగుతున్న అభివృద్ధి పనులపై బురదజల్లడం వల్ల అభివృద్ధి ఆగదని, ప్రజలు కూడా ఇలాంటి అసత్య ప్రచారాలను నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, మధిర అభివృద్ధి కోసం నిరంతరం కట్టుబడి పని చేస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## వైరా మండలం లో ఉన్నత పాఠశాలలో సోషల్ అడిట్ కమిటీ విచారణ



**వైరా, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్) :**

రాష్ట్ర వ్యాప్తం గా విద్యాశాఖ లో జరుగుతున్న సోషల్ ఆడిట్ లో భాగం గా వైరా మండలంలోని ఉన్నత పాఠశాలల్లో మంగళవారం సోషల్ ఆడిట్ ప్రారంభమైంది. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నియమించిన సోషల్ ఆడిట్ కమిటీ సభ్యులు సంపత్, చైతన్య కుమార్ తొలి రోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గన్నవరంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తదుపరి గరకపాడు కాంప్లెక్స్ పరిధి లోని గరికపాడు, సిరిపురం (కెజి) ఉన్నత పాఠశాలలు అలాగే గవర్నమెంట్ హై స్కూల్ వైరా,రెబ్బవరం క్లస్టర్స్ పరిధిలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో సోషల్ ఆడిట్ నిర్వహించబడుతుంది. ఈ ఆడిట్ లో పాఠశాలలకు మంజూరైన నిధుల వినియోగం, భౌతిక సౌకర్యాలు, విద్యుత్ తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, ప్రయోగశాలలు, డిజిటల్ పరికరాల వినియోగం, క్రీడా సామగ్రి, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలిస్తారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఆడిట్ కమిటీ విచారించింది. సోషల్ ఆడిట్ అనంతరం సమగ్ర నివేదికను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖకు సమర్పించనున్నారు. ఆడిట్ కమిటీ సభ్యులు చైతన్య కుమార్ మాట్లాడుతూ అందరు ప్రధానోపాధ్యాయులు సోషల్ ఆడిట్‌కు సంబంధించిన రికార్డులు, నివేదికలు, ధ్రువపత్రాలు, మెటీరియల్, స్టాక్ రిజిస్టర్స్ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి చావా శ్రీనివాసరావు, గన్నవరం గ్రామ సర్పంచ్ యేసు , వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ భూముల ధారాదత్తంపై భగ్గుమన్న బీజేపీ



**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :** సత్తుపల్లి మండలం బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ భూముల కేటాయింపుల్లో జరిగిన భారీ కుంభకోణంపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్ర స్థాయిలో భగ్గుమంది. కోట్లాది రూపాయల ప్రజాధనంతో అభివృద్ధి చేసిన అత్యంత విలువైన పారిశ్రామిక భూములను పొరుగు రాష్ట్రానికి చెందిన ప్రైవేటు సంస్థకు కారుచౌకగా ధారాదత్తం చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం బీజేపీ శ్రేణులు కదం తొక్కాయి. బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున జిల్లా కలెక్టరేట్‌కు తరలివెళ్లి, ఈ అక్రమాలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ దివాకర్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక రైతులు పండించే పత్తి, మిర్చి, మామిడి వంటి వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు చేసి వారికి గిట్టుబాటు ధర కల్పించాలనే సదుద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ ఫుడ్ పార్క్ లక్ష్యాన్ని పాలకులు తుంగలో తొక్కారని ఆయన మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ 'ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన' పథకం కింద మంజూరైన సుమారు రూ. 50 కోట్ల నిధులతో ఈ ఫుడ్ పార్క్‌ను అభివృద్ధి చేశారని, కానీ ఇప్పుడు ఆ ఫలాలను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దీపక్ నెక్స్ జెన్ అనే ఆక్వా ప్రాసెసింగ్ సంస్థకు అప్పనంగా కట్టబెడుతున్నారని ఆయన ఆరోపించారు. గతంలో ఎకరాకు రూ. 51 లక్షలుగా ఉన్న భూమి ధరను, కేవలం ఈ సంస్థకు మేలు చేయడం కోసం నిబంధనలకు విరుద్ధంగా రూ. 25 లక్షలకు తగ్గించి ఏకంగా 72 ఎకరాలను కేటాయించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.బహిరంగ మార్కెట్లో ఫుడ్ పార్క్ పరిసర ప్రాంతాల్లో ఎకరా భూమి విలువ రూ. 50 లక్షల నుంచి రూ. 75 లక్షల వరకు పలుకుతోందని, ఆశ్చర్యకరంగా ఇదే దీపక్ నెక్స్ జెన్ సంస్థ ఫుడ్ పార్క్ పక్కనే రహదారి సౌకర్యం కోసం ఒక ప్రైవేట్ రైతు వద్ద ఎకరా భూమిని ఏకంగా రూ. 75 లక్షలకు కొనుగోలు చేసిందని కోటేశ్వరరావు గుర్తుచేశారు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద అంత భారీ ధరకు భూమి కొన్న సంస్థకు, ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలు కల్పించిన ఫుడ్ పార్క్ భూమిని మాత్రం ఇంత తక్కువ ధరకు అమ్మి ప్రజాధనాన్ని బహిరంగంగా లూటీ చేస్తున్నారని ఆయన విమర్శించారు. జిల్లాలో సాగు అంతగా లేని రొయ్యలు, చేపల దాణా పరిశ్రమకు పెద్దపీట వేయడం వల్ల స్థానిక రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరుతుందో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.తక్షణమే ఈ అక్రమ భూ కేటాయింపులను రద్దు చేయాలని కలెక్టర్‌కు అందించిన వినతిపత్రంలో బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. ఈ భారీ అవినీతిపై సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ , సీబీఐ ద్వారా సమగ్ర దర్యాప్తు జరిపించాలని, అలాగే ప్రాజెక్టు పెట్టుబడులు, నిధుల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని, గతంలో బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి సైతం ఈ వ్యవహారంపై కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్‌కు ఫిర్యాదు చేశారని, అవసరమైతే ఈ పోరాటాన్ని ఢిల్లీ స్థాయికి తీసుకువెళ్తామని బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు, నరుకుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


## ప్రాణరక్షణ నైపుణ్యాలపై విద్యార్థినులకు సీపీఆర్, బీఎల్ఎస్ శిక్షణ



**శామీర్‌పేట, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్) :**

జాతీయ బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్), కార్డియోపల్మనరీ రీసస్సిటేషన్ (సీపీఆర్) దినోత్సవాన్ని పురస్కరించుకుని జగద్గిరిగుట్ట శామీర్ పేట లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థినులకు ప్రత్యేక ప్రాయోగిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ట్విన్ సిటీస్ శాఖ), యశోద ఆస్పత్రి–హైటెక్ సిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే సీపీఆర్, బీఎల్ఎస్ విధానాలు, చెస్ట్ కంప్రెషన్స్, ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫిబ్రిలేటర్ (ఏఈడీ) వినియోగంపై ప్రత్యక్షంగా శిక్షణ అందించారు.ఈ సందర్భంగా అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డా. గీత మాట్లాడుతూ విద్యతో పాటు జీవన నైపుణ్యాలు కూడా ప్రతి విద్యార్థికి అవసరమని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా. వి. స్రవంతి అత్యవసర సమయాల్లో సమయస్ఫూర్తితో స్పందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డా. కె. అనిత మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా ప్రతి ఎన్ఎస్ఎస్ వాలంటీర్ ప్రాణరక్షకుడిగా తీర్చిదిద్దడమే ఈ శిక్షణ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.21ఎస్ ఎమ్ పి టి 1 విద్యార్థులకు సి పి ఆర్ విధానాన్ని నేర్పిస్తున్న వైద్యులు

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి -ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్




**ఖమ్మం (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని వేగవంతం చేసి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, ఎన్యూమరేషన్ ప్రక్రియ, ఫిర్యాదుల పరిష్కారం, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరిస్తూ, ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం 80 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 65 శాతం డిజిటలైజేషన్ జరిగిందని తెలిపారు. జిల్లాలో శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన, మరణించిన ఓటర్ల సంఖ్య సుమారు 55 వేలు (5 శాతం) ఉండగా, వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటే జిల్లాలో సుమారు 85 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లేనని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. సోమవారం ఒక్కరోజే జిల్లాలో 20 వేల మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశామని, ఇదే వేగంతో పనులు కొనసాగిస్తే రానున్న ఐదు రోజుల్లో 90 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని చేరుకుంటామని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించిన మేరకు ప్రతి బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో) లక్ష్యం మేరకు ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేసేలా కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ డిజిటలైజేషన్ పురోగతిని సమీక్షిస్తూ లక్ష్యాలను సాధించాలని సూచించారు.పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, 50 శాతం కంటే తక్కువ పురోగతి ఉన్న పోలింగ్ స్టేషన్లను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహించి బీఎల్‌వోలకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ప్రతి ఓటరుకి అందించిన ఎన్యూమరేషన్ ఫారం నింపడంలో బీఎల్‌వోలు ప్రజలకు సహకరించాలని, ఎన్నికల సంఘం రూపొందించిన అవగాహన వీడియోలను విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కలూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్డీసీ సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డీటీ అన్సారీ, ఇతర ఎన్నికల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణాపురం రైల్వే గేట్‌కు మోక్షం, ఆర్వోబి నిర్మాణంపై ముందడుగు

**ఖమ్మం (జర్నలిస్ట్ ఫైల్) :** చింతకాని మండలం రామకృష్ణాపురం సమీపంలోని 107 రైల్వే గేట్ వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మాణానికి ఎట్టకేలకు అడుగు ముందుకు పడింది. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చొరవ ఫలితంగా ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న సమస్యకు పరిష్కారం లభించింది. దానికి తోడు గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు చేసిన విజ్ఞప్తులు, వివిధ పత్రికలు, సోషల్ మీడియాలో వచ్చిన కథనాలకు స్పందన లభించింది. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ బాబ్జి ప్రసాద్ ఆధ్వర్యంలో రైల్వే రోడ్ సేఫ్టీ అధికారి సుందర్ సేన్, ఇతర అధికారులతో కలిసి రామకృష్ణాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆర్వోబి నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ అంశం.. గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆమోదం తదితర అంశాలపై సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ గాదె నాగలక్ష్మి , ఉప సర్పంచ్ గాదె రామారావు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రైల్వే రోడ్ సేఫ్టీ అధికారి సుందర్ సేన్ మాట్లాడుతూ ఆర్‌ఓబీ నిర్మాణానికి అవసరమైన ప్రక్రియలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. నిర్మాణం కోసం భూములు కోల్పోయే రైతులు పూర్తి సహకారం అందించాలని కోరారు. భూమి కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం తగిన పరిహారం అందజేస్తామని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈ ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. త్వరలోనే సర్వే పనులు ప్రారంభించి నిర్మాణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. గ్రామంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరిస్తే ఆర్‌ఓబీ నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.--- ఎంపీ వద్దిరాజు కృషి రామకృష్ణాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం గ్రామస్తులంతా ఏడాది క్రితం ఎంపీ వద్దిరాజు రవిచంద్రను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు రవిచంద్ర స్పందించి ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ సందర్భంగా రామకృష్ణాపురం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ఆవశ్యకత గురించి మంత్రికి వివరించారు. ఆ మేరకు కొద్ది



రోజులకే రైల్వే మంత్రి స్పందించి ఎంపీ రవిచంద్ర కు లేఖ రాశారు. బ్రిడ్జి నిర్మాణ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, దీనిపై తొందరలో సముచిత నిర్ణయం తీసుకుంటామని హామీ ఇస్తూ మంత్రి అశ్విని వైష్ణవ్ హామీ ఇచ్చారు. ఆ మేరకు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రిత్వ కార్యాలయం నుంచి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రామకృష్ణాపురం గ్రామస్తులు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కు కృతజ్ఞతలు తెలిపారు.

## రెజొనెన్స్ ఇన్ఫో స్కూల్ వి.డి.వోస్ కాలనీ క్యాంపస్లో విద్యార్థులకు మాక్ ఎలక్షన్స్ నిర్వహిణ

**ఖమ్మం, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్) :**

రెజొనెన్స్ ఇన్ఫో స్కూల్ వి.డి.వోస్ కాలని క్యాంపస్లో విద్యార్థులకు మాక్ ఎలక్షన్స్ నిర్వహించారని పాఠశాల డైరెక్టర్ ఆర్.వి నాగేంద్ర కుమార్ ఒక ప్రకటనలో తెలియ జేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజ నిర్మాణంలో భాగ స్వాములు కావాలని మంచి పౌరులుగా తీర్చి దిద్దబడాలని మన దేశంలోని ప్రజాస్వామ్య విలువలని కాపాడే భాగంగా మంచి నాయకులను రహస్య బ్యాలెట్ విధానంలో ఎన్ను కునేవిదంగా విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కలగటానికి " మాక్ ఎలక్షన్స్ ద్వారా తరగతి లీడర్ను ఎన్నుకును విదానం చాలా ఉపయోగకరంగా ఉంటుందని విద్యార్థులందరు ఓటర్ స్లిప్స్ను చూయిస్తూ రహస్య బ్యాలెట్ మాక్సులో ఓటర్ స్లిప్స్ వేయ టం నిజమైన ఎన్నికలు జరుగు విధానంకి ప్రత్యక్ష సాక్షి గా ఉన్నాయని కొనియాడారు. డైరెక్టర్ కె.శ్రీదర్ మాట్లాడుతూ ఇటు వంటి మాక్ ఎలక్షన్స్ నిర్వహించటం వలన ప్రజాస్వామ్య ప్రభుత్వంలో రాజకీయ నాయకుల కష్ట నష్టాలు విద్యార్థులకు తెలియటంతో పాటు మంచి అవగాహన పెంపొందె అవకాశం ఉన్నది అని తెలియ పరిచారు కో– డైరెక్టర్ నీలిమా మాట్లాడుతూ విద్యార్థులకు రహస్య బ్యాలెట్ విద్యానంలో ఎన్నికలు నిర్వహంచటంలో మంచి నాయకత్వలక్షణాలున్న తమ తోటివిద్యార్థుల నుండి ఒకరిని స్కూల్ లీడర్ గా మరియు కో – లీడర్ గా ఎన్ను




కోవటం విద్యార్థులకు మంచి బాధ్యతయుత అవకాశాలు వస్తాయని ఇటు వంటి కార్యక్రమాలు మా విద్యార్థులకు నిర్వహించటం మాకు ప్రతేకం గా ఉన్నదని తెలియజేశారు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని విద్యారులను ప్రిన్సిపాల్ టి. గోపాలకృష్ణ, ఎ.ఓ శివకుమారు ఉపాధ్యాయులు అభినందించారు.

## డిగ్రీ మూడో సెమిస్టర్ ఇంగ్లీష్ పుస్తకావిష్కరణ



**ఖమ్మం, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్) :**

ప్రభుత్వ మహిళా కళాశాలకు చెందిన ఆంగ్లం అధ్యాపకులు డాక్టర్ గాయత్రి రచించిన డిగ్రీ మూడో సెమిస్టర్ ఆంగ్ల పుస్తకం ఇంగ్లీష్ ఫర్ మాస్టరీ పుస్తకం ప్రిన్సిపాల్ డాక్టర్ బానోత్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అధ్యాపకులు రచయిత గాయత్రి ని అభినందించారు. ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జానకి రామారావు, అధ్యాపకులు రవి శంకర్, ప్రవీణ్, రామ్ కుమార్ స్వామి, రమేష్, బొంద్యాలు, సావిత్రి, శ్యామల దేవి, మల్లేశం, శ్రీనివాసరావ్, కుతుంబాక కవిత, సూర్యలక్ష్మి , పేరెల్లి శ్రీను, రాజేష్, వెంకన్న, అశోక్ పాల్గొన్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.

## ఎరువుల కొరత లేదు రైతులు యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకోవాలి



**ఇబ్రహీంపట్నం, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్) :**

యాచారం మండల రైతులందరికీ,తెలియజేస్తున్నాము ఈ వానకాలం 2026 యూరియా ఇతర సబ్సిడీ ఎరువులు అన్ని కూడా ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్ ద్వారా నే మన యాచారం మండలంలోనీ సాగు చేస్తున్న రైతులు ఎరువుల కొనుగోలు చేస్తున్నారు.ఎలాంటి ఎరువుల కొరత లేదు. సాగు చేసే అందరు రైతులకు ఎరువులు అందుతాయి.రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు. ఇది నిరంతర ప్రక్రియ.ఈ యాప్ గురించి మన యాచారం మండలంలోనీ లైసెన్స్ ఉన్న అందరు డీలర్స్ కు, వాలంటీర్స్, గ్రామ పంచాయతీ సెక్రెటరీస్ కు, మీసేవ, సిఎస్సి సెంటర్ కు,గ్రామసభలో పాల్గొన్న రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా ఎవరైతే మన మండలం లోని ఎరువులు అవసరమైన రైతులకు ఈ యాప్ పై బుక్ చేసుకోవడం కోసం మన మండలం లోని డీలర్స్ అవగాహన చేసి, ఎరువులు బుక్ చేసుకోవడానికి మాత్రమే సహకారం చేస్తున్నారు.డీలర్స్ కు అవసరమైతే వారు కంపెనీకీ ఇండెంట్ పెట్టుకొని తెచ్చుకోవడానికి అవకాశం వుంది. అలాగే ఈ యాప్ రైతు స్వీయ ధృవీకరణ తోటే ఎరువులు బుక్ చేసుకోవాలి,కానీ లైసెన్స్ ఉన్న డీలర్స్ చెయ్యడానికి లేదు. వాళ్ళు రైతులకు బుక్ చేసుకోవడానికి మాత్రమే సహకారం చేస్తున్నారు. వాళ్ళకి ఎరువుల కంపనీ ద్వారా ఎరువులు తెచ్చుకొనే అవకాశం ఉంది. అలాగే ప్రతి గ్రామంలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో నిగ్రని సమితి నీ ఏర్పాటు చేయడం జరిగింది.రైతులు ఎరువులను వాళ్ళకి అవసరమైన సాగు చేస్తున్న వరకే తీసుకొన గలరు అలాగే తోటి రైతులకు సహాయం అందించాలని విజ్ఞప్తి.అలాగే ఎలాంటి ఎరువుల కొరత లేదు. ఇది నిరంతర ప్రక్రియ.అలాగే ఇప్పుడు మనకు ఎలి నినో ప్రభావం ఉంది కావున అందరు రైతులు నేలపై తగినంత తడి వుండదు కాబట్టి, నీటిలో కరిగే ఎరువులను పిచికారీ చేసి, మన సాగు చేస్తున్న పంటలను కాపాడు కావాల్సిందిగా మనవి.అలాగే ఈ వానకాలం లో వరి సాగు తగ్గించి ఆరుతడి పంటలు సాగు చెయ్యాలని విజ్ఞప్తి.ఇంకేమైనా సలహా సూచనలకు మన మండలంలోని వ్యవసాయ శాఖ ను సంప్రదించగలరు.

## అర్హులైన వారి ఓట్లు మిస్ కావద్దు



**ఖమ్మం, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్) :**

అర్హులైన వారి ఓట్లు మిస్ కాకుండా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్ ) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్ఐఆర్ ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కమర్తపు మురళి, ఖమ్మం నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి కోరారు. మంగళవారం ఖమ్మం నగరంలోని 50వ డివిజన్లో జరుగుతున్న సర్ ప్రక్రియను వారు పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఏ లకు పలు సూచనలు చేశారు. ఒక్కొక్క బూతులో ఎంత పర్సంటేజ్ అయిందో తెలుసుకుని అదే విధంగా ఇంకా ఎవరైనా ఓటర్స్ ఎన్యుమరేషన్ ఫామ్ తీసుకుపోయిన గాని తిరిగి ఇవ్వని వారు ఎవరైనా ఉన్నా డోర్ టు డోర్ తిరిగి అవి కలెక్ట్ చేయవలసిందిగా సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగడంలో బి.ఎల్.ఓల పాత్ర కీలకమని పేర్కొన్నారు. వారికి సహకారంగా తమ పార్టీ బి ఎల్ ఏ సహకారం కూడా గొప్పదన్నారు. స్థానిక డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ రాపర్తి శరత్ కుమార్ ఆధ్వర్యంలో ఓటర్లకు ఫారం నింపేందుకు సహాయ సహకారం అందించడం, ఆన్ లైన్ లో 2002 ఓటర్ల వివరాలు అందజేయడంపై అభినందించారు. ఈ కార్యక్రమంలో 50 వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ రాపర్తి శరత్ కుమార్, 50 వ డివిజన్ పార్టీ ఇంచార్జ్ గంగిశెట్టి శ్రీనివాస్, డీసీసీ ఉపాధ్యక్షులు కోసూరి ప్రసాద్, డీసీసీ అర్బన్ సెక్రటరీ కోనేటి నారాయణ, డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.కు సహాయం అందించాలని విజ్ఞప్తి.అలాగే ఎలాంటి ఎరువుల కొరత లేదు. ఇది నిరంతర ప్రక్రియ.అలాగే ఇప్పుడు మనకు ఎలి నినో ప్రభావం ఉంది కావున అందరు రైతులు నేలపై తగినంత తడి వుండదు కాబట్టి, నీటిలో కరిగే ఎరువులను పిచికారీ చేసి, మన సాగు చేస్తున్న పంటలను కాపాడు కావాల్సిందిగా మనవి.అలాగే ఈ వానకాలం లో వరి సాగు తగ్గించి ఆరుతడి పంటలు సాగు చెయ్యాలని విజ్ఞప్తి.ఇంకేమైనా సలహా సూచనలకు మన మండలంలోని వ్యవసాయ శాఖ ను సంప్రదించగలరు.

# నకిలీ కరెన్సీ కేసు ఛేదించిన పోలీసులు



○ ముగ్గురు అరెస్ట్.. రూ.500 నకిలీ నోట్లు, పరికరాల స్వాధీనం

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా ఫిరంగిపురం పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 18న నమోదైన నకిలీ కరెన్సీ కేసును టాస్క్‌ఫోర్స్, ఫిరంగిపురం పోలీసులు సంయుక్తంగా ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి నకిలీ కరెన్సీ నోట్లు, వాటి తయారీకి ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

ఫిరంగిపురం సీఐ భుజంగరావు ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టి ప్రకాశం జిల్లా కురిచేడు మండలం వాళపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో పాటు గుంటూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుంది. వారి వద్ద నుంచి రూ. 500 ముఖ విలువ కలిగిన 53 నకిలీ కరెన్సీ నోట్లు, నకిలీ నోట్ల తయారీకి ఉపయోగించే ప్రాథమిక పరికరాలను స్వాధీనం చేసుకుంది.

అరెస్టు చేసిన నిందితులను నరసరావుపేట కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపింది. నకిలీ కరెన్సీ తయారీ, చలామణి వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచి, ఇలాంటి నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు కొనసాగిస్తామని గుంటూరు జిల్లా పోలీసులు హెచ్చరించారు.

# ఐటీఐ రెండవ విడత అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2026-2027 విద్యా సంవత్సరానికి గాను ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి రెండవ విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు జిల్లా కన్వీనర్, విజయవాడ ప్రభుత్వ ఐటీఐ ప్రధాన అధికారి ఎం. కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు.

పదో తరగతి లేదా 8వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. అర్హులైన అభ్యర్థులు itiadmissions.ap.gov.in/iti వెబ్‌సైట్ ద్వారా గానీ, నేరుగా ప్రభుత్వ ఐటీఐకి వచ్చి గానీ ఆగస్టు 3వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్ దరఖాస్తును పూర్తి చేయాలని సూచించారు.

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆగస్టు 4వ తేదీ సాయంత్రం 6 గంటలలోపు వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ దరఖాస్తులు నింపేటప్పుడు తప్పులు దొర్లకుండా జాగ్రత్త పడాలని, వెరిఫికేషన్ సమయంలో వివరాలు సరిగా లేకపోతే అడ్మిషన్‌కు అనర్హులుగా ప్రకటిస్తామని హెచ్చరించారు. ఆన్‌లైన్ అప్లికేషన్ దాఖలు చేయడంలో సహాయం కోసం విజయవాడ ప్రభుత్వ ఐటీఐ నందు ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు విజయవాడలోని జిల్లా కన్వీనర్ కార్యాలయాన్ని నేరుగా గానీ లేదా 94906 కోరారు.

# శక్తి టీమ్స్ అవగాహన కార్యక్రమాలు



○ మహిళలు, బాలికల భద్రతపై గుంటూరు జిల్లా పోలీసుల ప్రత్యేక దృష్టి

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, ఈవ్‌టీజింగ్, స్టాకింగ్, సైబర్ నేరాల నుంచి రక్షణ కల్పించడమే లక్ష్యంగా గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'శక్తి టీమ్స్' జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఏఎస్ఐ బేబీ రాణి నాయకత్వంలోని బృందాలు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి.

ఈ సందర్భంగా విద్యార్థినులకు గుడ్ టచ్--బ్యాడ్ టచ్, లైంగిక వేధింపులు, ఈవ్‌టీజింగ్, స్టాకింగ్, సోషల్ మీడియా, మొబైల్ ఫోన్‌ల ద్వారా జరిగే సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితులను నమ్మవద్దని, వ్యక్తిగత వివరాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవద్దని, ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అత్యవసర పరిస్థితుల్లో డయల్-112, మహిళల హెల్ప్‌లైన్-181, చైల్డ్ హెల్ప్‌లైన్-1098 సేవలను వినియోగించుకోవాలని అధికారులు వివరించారు. మహిళలు, బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, నేరాల పట్ల అప్రమత్తత కల్పించడం, భద్రమైన సమాజ నిర్మాణమే ఈ అవగాహన కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని గుంటూరు జిల్లా పోలీసులు తెలిపారు.

# కూటమి ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

○ కూటమి సుపరిపాలన శాశ్వతంగా కొనసాగాలంటే ఇంటింటికీ వెళ్లాలి - టీడీపీ జిల్లా అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు

○ గుంటూరు పశ్చిమ టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో కార్యకర్తలకు దిశానిర్దేశం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్ళాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి, కూటమి సుపరిపాలన శాశ్వతంగా కొనసాగాలంటే ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి, అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలని గుంటూరు టీడీపీ జిల్లా అధ్యక్షులు పిల్లి మాణిక్యరావులు పిలుపునిచ్చారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధ్యక్షతన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ వెంకటేష్ యాదవ్, సీనియర్ నాయకులు నిమ్మల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

తొలుత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల మరణించిన 19వ డివిజన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు బత్తుల రమణమ్మకు సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జూలై 27 నుంచి ప్రారంభం కానున్న "ఇంటింటికీ కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలు" కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని నాయకులు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలుగుదేశం పార్టీ బలోపేతం, కార్యకర్తల బాధ్యతలు, కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం పై విస్తృతంగా మాట్లాడారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా ప్రజల మధ్య నిరంతరం ఉండే నాయకత్వమే విజయాన్ని సాధిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు ఓడిపోవడానికి ప్రధాన కారణం ప్రత్యర్థుల బలం కాదని, ప్రజలతో అనుసంధానం తగ్గిపోవడమేనని అన్నారు.

తెలుగుదేశం పార్టీ సాధారణ రాజకీయ పార్టీ కాదని, పేదవారి సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఆవిర్భవించిన ఉద్యమ పార్టీ అని పేర్కొన్నారు. జూలై 27 నుంచి ప్రారంభమయ్యే ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతి డివిజన్ కమిటీ, ప్రతి బూత్ ఇన్‌చార్జి, ప్రతి నాయకుడు ప్రజల ఇళ్లకు వెళ్లి కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో సాధించిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని సూచించారు. ప్రతి ఇంటికి కరపత్రాలు అందించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. పార్టీ కోసం పనిచేసే వారికి ప్రాధాన్యం ఉంటుందని, క్రియాశీలకంగా పనిచేయని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యవస్థలు పూర్తిగా దెబ్బతిన్నాయని, కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టిందని అన్నారు. పోలవరం, అమరావతి, పరిశ్రమల రాక, ఉద్యోగాల కల్పన, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాల్లో ప్రభుత్వం అద్భుతమైన పనితీరు కనబరుస్తోందని పేర్కొన్నారు.

ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లకపోతే దుష్ప్రచారానికి అవకాశం కలుగుతుందని, అందుకే ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించాలని పిలుపునిచ్చారు. రోజుకు కనీసం 30 ఇళ్లను సందర్శిస్తూ ప్రజలతో మమేకం కావాలని సూచించారు.

తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన శాశ్వతంగా కొనసాగాలంటే ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని, ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన అన్నారు.

ఈ సమావేశంలో ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ వెంకటేష్ యాదవ్, సీనియర్ నాయకులు నిమ్మల శేషయ్యలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

# 27 నుంచి తూర్పులో టీడీపీ ఇంటింటి ప్రచారం

○ కేడర్ నుంచి లీడర్ వరకు...

○ బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు 45 రోజులపాటు ప్రజల్లోనే..

○ కూటమి విజయాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన బాధ్యత శ్రేణులదే..

○ టీడీపీ సర్వసభ్య సమావేశంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో అన్ని వర్గాలకు అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఈ నెల 27వ తేదీ నుంచి ఇంటింటికీ సంక్షేమ విజయాలు పేరిట ప్రజల ముంగిటకు తీసుకెళ్లబోతున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత లీడర్ నుంచి కేడర్ వరకు ఉందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం స్థానిక తూర్పు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే నసీర్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమానికి నూతన అధ్యాయం లిఖించారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలనే కాకుండా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను అమలు చేశామన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించి, సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా ప్రజల గుమ్మం ముంగిటకే చేర్చామని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా, ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా పథకాలు అందజేశామని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, దీపం-2 పథకం, స్త్రీశక్తి పథకం, సూపర్ సిక్స్ అమలు వంటి పథకాలు సమర్థవంతంగా అమలు చేశామన్నారు. తాజాగా తల్లివందనంతో ప్రతి విద్యార్థికీ నిధులు అందించామన్నారు. లబ్ధిదారుల ఎంపికలో కేవలం అర్హతనే ప్రామాణికంగా తీసుకుని ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ పథకాలు చేరవ చేశామని తెలిపారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రానికి రాజధాని కూడా లేకుండా చేస్తే కూటమి ప్రభుత్వంలో అమరావతిని ప్రపంచ రాజధానిగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఒక్క చాన్స్ పేరిట రాష్ట్రాన్ని వైసీపీ సర్వనాశనం చేసిందని మండిపడ్డారు.

కూటమి సంక్షేమ విజయాలు పేరిట ప్రతి ఇంటికీ టీడీపీ కేడర్ నుంచి లీడర్ వరకు వెళతారన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరిస్తూనే సమస్యలను తెలుసుకుంటారని చెప్పారు. మై టీడీపీ యాప్ లో ఫొటోలు నమోదు చేస్తారన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని, వీటిని ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

# వినుకొండలో టీడీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

○ 27 నుంచి 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమం



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** వినుకొండలోని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే, శ్రీ జీవీ ఆంజనేయులు కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ వినుకొండ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీ జీవీ ఆంజనేయులు పాల్గొని పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ--అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లే కార్యాచరణ, రానున్న పార్టీ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, ఈ నెల 27వ తేదీ నుంచి 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి గత రెండేళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

ప్రతి కార్యక్రమాన్ని 'మై టీడీపీ' యాప్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని, పార్టీ కార్యక్రమాల విజయవంతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఇంటింటికీ చేర్చాలని సూచించారు. అనంతరం పలు కీలక తీర్మానాలను ఆమోదించి పార్టీ రాష్ట్ర కార్యాలయానికి పంపించారు.

ఈ సమావేశంలో జీడీసీసీబి చైర్మన్ మక్కెన మల్లిఖార్జునరావు, పరిశీలకులు వక్కలగడ్డ మల్లికార్జున, వినుకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల టీడీపీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గర్భస్థ లింగ నిర్ధారణపై కఠిన చర్యలు



○ పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై ఉపజిల్లా స్థాయి సమీక్ష

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై ఉపజిల్లా స్థాయి సమీక్ష సమావేశం బుధవారం తెనాలి ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో డా. ఈరుగుల అన్నపూర్ణ అధ్యక్షతన నిర్వహించారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని, లింగ వివక్ష నిర్మూలనకు పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ పొందడంతో పాటు అవసరమైన రికార్డులు నిర్వహించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి స్కానింగ్ కేంద్రంలో స్కానింగ్ చార్జీల ధర పట్టిక, రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు టోల్‌ఫ్రీ నంబర్ 1800-233-2447 స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. గర్భస్థ శిశువు లింగాన్ని వెల్లడిస్తున్నారో లేదో తెలుసుకునేందుకు ప్రతి నెల డీకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

సమావేశంలో కమిటీ సభ్యులు బోళ్ళ సాంబిరెడ్డి, జిల్లా ఆసుపత్రి వైద్యులు డా. సంపూర్ణ, డా. కె. సురేష్, డా. వినీల్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పెనుగొండ వెంకటేశ్వరరావు, నాళం శ్రీమన్నారాయణమూర్తి, ముమ్మనేని భానుమతి, డా. నక్కా సుశాన్ గ్రేస్, డా. చందోలు విజేత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆళ్లగడ్డ వెంకటేశ్వరరావు, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పక్కాగా చేయాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి విచ్చేసే మార్గం, ప్రధాన వేదిక ఏర్పాటు, జాతీయ జెండా ఎగురవేయుటకు ఏర్పాట్లు, న్యాయమూర్తులు, న్యాయ అధికారులు, ఉన్నత అధికారులు, ఇతర విభాగాల వ్యక్తులు కూర్చొనుటకు ఏర్పాట్లు, పోలీస్ పెరేడ్, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నత అధికారులు, సాధారణ ప్రజానీకం వాహనాల పార్కింగ్, ప్రభుత్వ ప్రగతిని తెలియజేసే వివిధ శాఖల శకటాలు, తదితర అంశాలను పరిశీలించారు. బందోబస్తుతో సహా సాధారణ ప్రజానీకం వచ్చే మార్గాలు రద్దీపై ఎప్పటికప్పుడు చర్యలు వంటి అంశాలను చర్చించారు. పారిశుధ్య పనులు, తాగు నీరు ఏర్పాటు అంశాలపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పెద్ద ఎత్తున చేపట్టడం జరుగుతుందని, పరిసరాలు పూర్తిగా ఆహ్లాదకర వాతావరణం కలిగి ఉండాలని అన్నారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సి. ఆర్. డి. ఏ అదనపు కమిషనర్ అభిషేక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్. ఎస్. కె. ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాస రావు, ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్ రావు, సి. ఆర్. డి. ఏ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ అవగాహన ర్యాలీ

○ ర్యాలీని ప్రారంభించిన వైద్యాధికారి డాక్టర్ చెన్నంశెట్టి సుబ్బారావు



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** మండల గ్రామమైన కటివరం లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చెన్నంశెట్టి సుబ్బారావు ప్రారంభించారు. గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది కలిసి గ్రామంలో డెంగ్యూ వ్యాధికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చెన్నంశెట్టి సుబ్బారావు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి వైరస్ వలన వస్తుందని కానీ ఒకరి నుంచి ఒకరికి దోమ కాటు వలన వ్యాప్తి చెందుతుందని ఆయన తెలిపారు. డెంగ్యూని ప్రారంభ దశలో గుర్తించినట్లయితే పూర్తిగా నయం చేయవచ్చునని, ప్రజల సొంత వైద్యము చేసుకొవడశీ ద్వారా ఈ వ్యాధి తీవ్రత పెరిగి ఆసుపత్రిలో చేరే పరిస్థితిని వస్తుందని ఆయన పేర్కొన్నారు. డెంగ్యూ వ్యాధిలో జ్వరము, తలనొప్పి, కండరాల నొప్పులు, కనుగుడ్ల నొప్పులు, ఒంటిపై దద్దురు ఒంటి లక్షణాలు కనబడతాయని, కొంతమందిలో చిగుళ్ల వెంట, ముక్కు నుండి రక్తము కారుతుంటుందని ఈ లక్షణాలు ఎవరికైనా కనిపించినట్లయితే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి పరీక్షలను చేయించుకొవాలని, వైద్యాధికారి గారి సలహా మేరకు తగు మందులను ఉచితంగా పొందవచ్చునని ఆయన తెలిపారు.

తెనాలి యుయల్ బి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ ఏడిస్ దోమ కాటు వలన ఈ వ్యాధి ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతుందని ఆయన అన్నారు.

ఈ దోమ ఎక్కువగా మంచినీటిలోనూ, వర్షపు నీటిలోను గుడ్లు పెడుతుందని తద్వారా తన సంతతిని పెంచుకుంటుందని, కనుక ప్రజలు వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతతో పాటు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యంగా ఈ డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవము ప్రజలలో అవగాహన కల్పించి, ప్రజలను భాగస్వాములను చేసి తద్వారా వ్యాధిని అరికట్టాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలియజేశారు.

ముఖ్యంగా ప్రభుత్వము 3జ విధానాన్ని ప్రవేశపెట్టిందని అనగా నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం, మూతలు పెట్టి ఉంచుట ద్వారా దోమ పుట్టుకను ఆపడానికి అవకాశం కలుగుతుందని. దోమలు ముఖ్యంగా ఇంటి బయట తొట్లు గాబులు, పూల కుండీలు, పనికిరాని ప్లాస్టిక్ సామాన్లు, మూతలు లేని ఓవర్ హెడ్ ట్యాంకులు, టైర్లు, కొబ్బరి బొండాలు వంటి ప్రదేశాలను ఇంటి లోపల ఫ్రిజలు, కూలర్లలో గల నీటిలో దోమలు గుడ్లను పెడతాయని ఆయన తెలియజేశారు.

ప్రజలు వారానికి ఒకసారి అనగా శుక్రవారం ను డ్రైడేగా పాటించాలని ఆయన కోరారు. ముఖ్యంగా ప్రజలు దోమకాటుకు గురికాకుండా సాయంత్రం సమయాలలో తలుపులు కిటికీలు వేసుకొని ఉండుట, దోమతెరలు వాడుట, పూర్తి వస్త్రధారణ ధరించుట వంటి జాగ్రత్తలను తీసుకోవాలని, నీటి నిలవలపై తప్పక మూతలు పెట్టి ఉంచాలని ఆయన తెలిపారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు మరియు ప్రధానోపాధ్యాయులు తాటి శ్రీధర్, ఉపాధ్యాయులు కందిమల్ల రమేష్ బాబు, సహాయ సహకారాలతో విద్యార్థినీలతో గ్రామ సచివాలయ ఆరోగ్యకేంద్రం నుండి కటివరం లోని పలు ప్రధానవీధుల ద్వారా డెంగ్యూ వ్యతిరేక నినాదాలు చేసుకుంటూ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు.

జిల్లా పరిషత్ విద్యార్థినీ విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది స్థానికలతో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవములపై గ్రామపంచాయతీ కార్యాలయ ప్రధాన కూడలిలో ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని యుయల్ బి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రమౌళి చేయించారు.

ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు డి.సాయిసుదర్శన ఆంజనేయశాస్త్రి, సయ్యద్ కరిముల్లా, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి సూరపనేని అనురాధ, ఒడుగుమహాలక్ష్మి, ఆశాకార్యకర్తలు విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి : ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్




○ 'మృగం' షార్ట్ ఫిల్మ్ టీజర్ ఆవిష్కరణ

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** డ్రగ్స్‌తో పాటు ఇతర చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని శాసన మండలి సభ్యుడు, తెనాలి టీడీపీ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం తెనాలిలోని టీడీపీ కార్యాలయంలో యువ దర్శకుడు త్రివిక్రమ్ రూపొందించిన 'మృగం' షార్ట్ ఫిల్మ్ టీజర్‌ను ఆయన ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, యువత చెడు వ్యసనాలకు బానిసైతే వారి ఆలోచనా విధానం, ప్రవర్తన ఎలా మారుతుందో దర్శకుడు త్రివిక్రమ్ ఈ చిత్రంలో కళ్లకు కట్టినట్లు చూపించారని అన్నారు. ఈ షార్ట్ ఫిల్మ్ యువతలో చైతన్యం తీసుకువచ్చి మంచి మార్పుకు దోహదపడుతుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరలో విడుదల కానున్న చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించి ప్రోత్సహించాలని కోరారు.
దర్శకుడు త్రివిక్రమ్ మాట్లాడుతూ, గతంలో తాను రూపొందించిన 'మనం' షార్ట్ ఫిల్మ్‌కు ఉత్తమ దర్శకుడిగా అవార్డు లభించిందన్నారు. సమాజంలో యువతలో సత్ప్రవర్తన పెంపొందించాలనే లక్ష్యంతో 'మృగం' చిత్రాన్ని రూపొందించామని, ప్రేక్షకులు ఆదరిస్తే భవిష్యత్తులోనూ సామాజిక సందేశంతో కూడిన చిత్రాలను రూపొందిస్తానని తెలిపారు. పంతగాని నాగరత్నమ్మ నిర్మించిన ఈ షార్ట్ ఫిల్మ్‌కు మహేంద్ర ఛాయాగ్రాహకుడిగా పనిచేశారు. విజయ్, అక్షయ ప్రధాన పాత్రలు పోషించగా, కుమారరాజా, చిన్నోడు, అశోక్, ప్రశాంత్ ఇతర కీలక పాత్రల్లో నటించారు.

## పార్టీ కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలు చేయాలి: ఎమ్మెల్సీ ఆలపాటి

○ 27 నుంచి ఇంటింటికీ కూటమి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రచారం



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** పార్టీ నిర్ణయించిన ప్రతి కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో అమలు చేసి ప్రజల్లోకి తీసుకెళ్లాలని శాసన మండలి సభ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం తెనాలి రామలింగేశ్వరపేటలోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.
బీఎల్ఏలు, బీఎల్‌వోలతో కలిసి బూత్ స్థాయిలో ఇప్పటికే చేపట్టిన కార్యక్రమాల వల్ల క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహన ఏర్పడిందని, దీనితో బూత్ స్థాయిలో పార్టీ కార్యక్రమాల అమలు మరింత సులభంగా సాగుతుందని తెలిపారు. ప్రతి కార్యకర్త ప్రజలతో నిరంతరం మమేకమై పనిచేయాలని సూచించారు.
ఈ నెల 27 నుంచి 40 రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. తల్లికి వందనం పథకం కింద చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి సంబంధించిన తల్లుల ఖాతాల్లో బుధవారం నుంచి నగదు జమ అవుతోందని, సూపర్‌సిక్స్ హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని పేర్కొన్నారు.
సమావేశంలో క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జీలు, బూత్ కన్వీనర్లు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని రానున్న కార్యక్రమాల అమలు, బూత్ స్థాయి కార్యాచరణపై చర్చించారు.

## బ్రహ్మం చౌదరిని పరామర్శించిన నారా లోకేష్



**తాడేపల్లి (జర్నలిస్ట్ ఫైల్):** కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరిని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. మణిపాల్ ఆసుపత్రికి వచ్చిన మంత్రి.. బ్రహ్మం చౌదరిని కలిశారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. బ్రహ్మం మాట్లాడుతూ ప్రస్తుతం అంతా బాగానే ఉందని తెలిపారు. మణిపాల్ వైద్యులతో లోకేష్ మాట్లాడగా బ్రహ్మం చౌదరి పూర్తిగా కోలుకున్నారని, త్వరలో డిశ్చార్జ్ చేస్తామని వారు తెలిపారు. బ్రహ్మం చౌదరి సతీమణి గౌతమి శ్వేతతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

## 'జయహో ధరణి' నృత్యానికి వరల్డ్ రికార్డు




**నిడదవోలు, (జర్నలిస్ట్ ఫైల్):** పెరవలి మండలం ఖండవల్లిలోని శ్రీ సర్వోదయ విద్యానికేతన్ విద్యార్థులు జాతీయ భావం, పర్యావరణ పరిరక్షణ సందేశంతో ప్రదర్శించిన 'జయహో ధరణి జయహో' నృత్య రూపకం గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్లో చోటు దక్కించుకోవడం అభినందనీయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం పాఠశాలను సందర్శించిన మంత్రి, రాష్ట్ర జానపద కళాకారుల ఆధ్వర్యంలో 333 మంది విద్యార్థినులు ఏకకాలంలో ప్రదర్శించిన నృత్యాన్ని వీక్షించి, వరల్డ్ రికార్డు సర్టిఫికెట్‌ను విద్యార్థులు, పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జాతీయ భావాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని భావితరాలకు చాటిచెప్పేలా ఈ కార్యక్రమం రూపుదిద్దుకోవడం అభినందనీయమన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం, మొక్కల పెంపకం, ప్రకృతి పరిరక్షణే 'జయహో ధరణి జయహో' సందేశమని పేర్కొంటూ, చిప్కో ఉద్యమాన్ని గుర్తు చేశారు. ఈ గేయాన్ని రచించిన కృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. చిన్న స్థాయిలో ప్రారంభమైన శ్రీ సర్వోదయ విద్యానికేతన్ నేడు సుమారు 640 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ ఆదర్శ విద్యాసంస్థగా ఎదగడం సంతోషకరమని మంత్రి దుర్గేష్ అన్నారు. సాంస్కృతిక విలువలు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చిన పాఠశాల యాజమాన్యం, జానపద కళాకారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమం అనంతరం పాఠశాల యాజమాన్యం మంత్రిని సత్కరించగా, చిన్నారులతో ఆయన ఉత్సాహంగా గడిపారు.

## వేమూరులో కూటమి విస్తృత స్థాయి సమావేశం

○ "2 ఏళ్ల నమ్మకం" ఇంటింటి ప్రచారాన్ని విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



**వేమూరు (జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో చేపట్టిన "2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వేమూరులోని ఎన్టీఆర్ పురవేదికలో బుధవారం నిర్వహించిన వేమూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.
సమావేశంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షులు, క్లస్టర్-యూనిట్-బూత్ (సీయూబీ) ఇన్‌ఛార్జ్‌లు, కూటమి నాయకులకు ఇంటింటి ప్రచార కార్యక్రమ నిర్వహణపై ఎమ్మెల్యే సమగ్ర దిశానిర్దేశం చేశారు.
అనంతరం ప్రచార కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించి, కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.
ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసి అభివృద్ధి, సంక్షేమంలో విశేష ఫలితాలు సాధించిందన్నారు. ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రతి ఇంటి గడపకు చేర్చే బాధ్యత కార్యకర్తలపై ఉందని, దీనిని పార్టీ కార్యక్రమంగా కాకుండా ప్రజా కార్యక్రమంగా భావించి ప్రతి కుటుంబాన్ని కలవాలని కోరారు.
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం, స్త్రీ శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం-2, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, ఉచిత ఇసుక విధానం, సబ్సిడీ రుణాలు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, మత్స్యకార భరోసా, సూపర్ సిక్స్ హామీల అమలు వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు సహా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అందించిన ప్రయోజనాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.
ప్రతి బూత్ పరిధిలో రోజుకు కనీసం 30 ఇళ్లను సందర్శించి ప్రభుత్వ విజయాలను వివరించడంతో పాటు ప్రజల అభిప్రాయాలను సేకరించి మైటీడీపీ (వీమిత్రా) యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రచారంలో భాగంగా ఓటీపీ ధృవీకరణ, జీపీఎస్ నమోదు, ఫోటో అప్‌లోడ్ వంటి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.
జూలై 27 నుంచి ఆగస్టు 7 వరకు వేమూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జరిగే ఇంటింటి ప్రచార కార్యక్రమంలో తాను స్వయంగా పాల్గొని ప్రజలను కలుస్తానని ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలు, సూచనలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

## ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లపై మంత్రుల కమిటీకి జేఏసీ మెమోరాండం

○ పరిష్కారం లేకుంటే దశలవారీ ఉద్యమాలకు హెచ్చరిక

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆర్టీసీ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు బుధవారం సచివాలయంలో మంత్రుల కమిటీకి సమగ్ర మెమోరాండం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానం మేరకు జరిగిన సమావేశంలో జేఏసీ కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు పాల్గొని ఉద్యోగుల ఆర్థిక, సేవా సమస్యలతో పాటు సంస్థ పరిరక్షణకు సంబంధించిన పలు కీలక డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.
ఉద్యోగుల పెండింగ్ ఆర్థిక బకాయిలన్నింటినీ వెంటనే చెల్లించాలని, వేతన సవరణ (పీఆర్సీ) అమలు చేసి డీఏ బకాయిలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలను విడుదల చేయాలని జేఏసీ కోరింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఆర్టీసీలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను శాశ్వత నియామకాల ద్వారా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేసింది. స్త్రీశక్తి పథకం అమలుతో పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కనీసం 4 వేల కొత్త బస్సులను ఆర్టీసీ ద్వారానే కొనుగోలు చేయాలని, స్త్రీశక్తి పథకం, ఇతర రాయితీల కింద చెల్లించాల్సిన నెలవారీ రూ. 350 కోట్లను పూర్తిగా విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించే విధానాన్ని విరమించి, ఆర్టీసీ ఆధ్వర్యంలోనే కొనసాగించాలని కోరింది.
ఆర్టీసీ ఆస్తులు, డిపోలు, సేవలను ప్రైవేటీకరణ చేయకుండా ప్రభుత్వ రంగంలోనే బలోపేతం చేయాలని, సిబ్బందిపై పెరుగుతున్న దాడులను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని జేఏసీ పేర్కొంది. బదిలీలపై ఉన్న ఆంక్షలను తొలగించి గత విధానాన్ని కొనసాగించాలని, పదోన్నతులకు అర్హులైన సుమారు 3,500 మంది ఉద్యోగులకు అవకాశం కల్పించేందుకు ఫ్రీజింగ్ గడువును ఆగస్టు వరకు పొడిగించాలని కోరింది.
పీఆర్సీ, డీఏ బకాయిలను సీపీఎస్ ఉద్యోగుల మాదిరిగా నగదు రూపంలో చెల్లించాలని, ఈహెచ్ఎస్ ద్వారా సరైన వైద్యసేవలు అందడం లేదని పేర్కొంటూ విలీనానికి ముందు అమల్లో ఉన్న వైద్య సౌకర్యాలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేసింది. మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించడంతో పాటు పెండింగ్ కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని కోరింది. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, వర్క్‌షాప్‌లు, యూనిట్లలో ఉద్యోగులను సమీకరించి దశలవారీ ఉద్యమాలను ఉద్ధృతం చేయాల్సి వస్తుందని జేఏసీ హెచ్చరించింది. ప్రభుత్వ స్పందనను బట్టి ఈ నెల 30న విజయవాడలో రాష్ట్ర జేఏసీ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణను ప్రకటించనున్నట్లు కో-కన్వీనర్లు పి.వి. రమణారెడ్డి, జి.వి. నరసయ్య, రాజేష్‌కుమార్ తెలిపారు.

## ఉద్యోగుల ఆర్థిక డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి : ఏపీ జేఏసీ అమరావతి

○ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ప్రభుత్వానికి స్పష్టమైన విజ్ఞప్తి



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** సచివాలయంలో బుధవారం జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి నాయకులు పాల్గొని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆర్థిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. చర్చలు సానుకూలంగా జరగాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాల్సిన ఉద్యమ సన్నద్ధత సభలను వాయిదా వేసినట్లు జేఏసీ నాయకులు తెలిపారు.
జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్ నియామకం, మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించడం, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల విడుదల, ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిల వివరాలను పారదర్శకంగా వెల్లడించి చెల్లింపులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.
అలాగే పదోన్నతులపై ఉన్న నిషేధాన్ని ఆగస్టు 31 వరకు ఎత్తివేయడంతో పాటు కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని కోరారు.
కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, ఆర్టీసీ ఉద్యోగులు, మహిళా ఉద్యోగుల సమస్యలతో పాటు మొత్తం 29 అత్యవసర డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు జేఏసీ వెల్లడించింది. ప్రభుత్వానికి ఉద్యోగులు న్యాయబద్ధంగా రావాల్సిన జీతభత్యాలనే కోరుతున్నారని, వాటి పరిష్కారంలో జాప్యం చేయవద్దని విజ్ఞప్తి చేసింది.
ప్రభుత్వం తరఫున ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఉద్యోగులు-ప్రభుత్వం వేర్వేరు కాదని, ముఖ్యమంత్రి ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సానుకూలంగా ఉన్నారని తెలిపారు. ఉద్యోగ సంఘాలు ప్రస్తావించిన అన్ని అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరలో ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా పరిస్థితులను సమీక్షించి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకునేందుకు ఆగస్టు 2న ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర సెక్రటేరియట్ సమావేశం నిర్వహించనున్నట్లు నాయకులు వెల్లడించారు.

## ఉద్యోగుల సమస్యలపై సీఎం జోక్యం చేసుకోవాలి: ఏపీజీఈఎస్ఏ



○ 29 శాతం ఫిట్‌మెంట్‌తో నేరుగా వేతన సవరణ అమలు చేయాలని విజ్ఞప్తి

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ (ఏపీజీఈఎస్ఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాష కోరారు. బుధవారం గుంటూరు కలెక్టరేట్ వద్ద మాట్లాడుతూ, పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయకుండా నేరుగా 29 శాతం ఫిట్‌మెంట్‌తో వేతనాలను ఖరారు చేసి, 12వ వేతన సవరణను 2023 జూలై 1 నుంచి అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. పీఆర్సీ కమిషన్ ఏర్పాటు వల్ల వేతన సవరణ మరింత ఆలస్యమై ఉద్యోగులకు నష్టం జరుగుతుందని ఆయన అన్నారు. 2023 జూలై 1 నుంచి 2026 జూలై 31 వరకు ఉన్న పే ఫిక్సేషన్ ఏరియర్లను జీపీఎఫ్ ఖాతాల్లో జమ చేయాలని కోరారు. 2014లో రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 42 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుతం కనీసం 29 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం, పెండింగ్ బకాయిల చెల్లింపు తదితర అంశాలపై రాష్ట్ర జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని చాంద్ బాష కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రెహమాన్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రవి, ఉపాధ్యక్షుడు రాజు, నగర శాఖ అధ్యక్షుడు భాను, కోశాధికారి రాజు, అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ యోగాపై కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు శ్రీకారం

○ 365 రోజుల పాటు యోగా కార్యక్రమాలు జరిగేందుకు వీలుగా ప్రతిపాదనలు
○ పాఠశాలల్లో వారానికి రెండు రోజులు యోగా తరగతులు నిర్వహించే యోచన
○ యోగా మందిరాలుగా స్వర్ణ గ్రామ /వార్డు సచివాలయాలు
○ సంజీవనితో అనుసంధానం కూడా...
○ మంత్రి సత్యకుమార్ యాదవ్



**అమరావతి, జూలై 22 (జర్నలిస్ట్ ఫైల్):** యోగాను అంతర్జాతీయ యోగా దినోత్సవానికే పరిమితం చేయకుండా.. ఏడాది పొడవునా ప్రజల జీవన విధానంలో భాగస్వామ్యం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తోంది. 'ఇంటింటికీ యోగా' పేరుతో 365 రోజుల పాటు యోగా కార్యక్రమాలను నిర్విఘ్నంగా కొనసాగించేందుకు వీలుగా ప్రణాళికలు ప్రభుత్వం రూపొందించబోతుంది. గ్రామ, వార్డు సచివాలయాలను 'యోగా మందిరాలు'గా గుర్తించి ప్రజలకు 15 రోజుల ప్రాథమిక శిక్షణ ఇవ్వడం, అనంతరం మూడు నెలలపాటు ఇంటివద్ద సాధన చేయించడం ఈ ప్రణాళికలో కీలకం. మధుమేహం, అధిక రక్తపోటు వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలున్న వారికి వ్యాధులవారీగా చికిత్సాత్మక యోగా విధానాలను అవలంబించేలా చేయనున్నారు. సంజీవని పథకం కింద జరిగే ఆరోగ్య పరీక్షల్లోనూ యోగాసనాలను అనుసంధానం చేయబోతున్నారు. ఈ కార్యాచరణ రూపకల్పన గురించి రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ జారీ చేసిన ఆదేశాల మేరకు తొలి సమావేశం ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అధ్యక్షతన బుధవారం విజయవాడలోని ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఇంటింటి యోగా కార్యక్రమాలు ఎలా ఉండాలన్న దానిపై చర్చించారు. ఇంకా మరికొన్ని సమావేశాలు జరగనున్నాయి. సాధ్యమైనంత త్వరగా ఈ ప్రతిపాదనలను మంత్రివర్గం ముందుకు తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు.

**సచివాలయం నుంచే శిక్షణ :** కార్యాచరణ ప్రణాళికలో ఉంచాల్సిన అంశాలపై జరిగిన చర్చ ప్రకారం... ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ వ్యవస్థలనే వినియోగించనున్నారు. స్వర్ణ గ్రామ /వార్డు సచివాలయాలతోపాటు వైద్య కళాశాలలు, జిల్లా ఆసుపత్రులను యోగా మందిరాలుగా గుర్తించనున్నారు. కొత్త భవనాలు, ప్రత్యేక సిబ్బంది కోసం ఎదురుచూడకుండా ప్రస్తుతం ఉన్న మౌలిక వసతులు, ఉద్యోగులతోనే కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్నారు.
ప్రతి యోగా మందిరంలో 15 రోజులపాటు ఏకరీతి ప్రాథమిక శిక్షణ అందిస్తారు. అనంతరం మూడు నెలలు ఇంటివద్ద సాధన కొనసాగించేలా ప్రోత్సహిస్తారు. నెలకోసారి లేదా రెండు నెలలకోసారి పునశ్చరణ తరగతులు నిర్వహిస్తారు. నిర్దేశించిన సాధన పూర్తిచేసిన వారికి ధ్రువపత్రాలు ఇవ్వాలన్న ప్రతిపాదన కూడా వచ్చింది.
గ్రామస్థాయిలో కార్యక్రమాన్ని విస్తరించేందుకు మధ్యస్థాయి ఆరోగ్య సేవల ప్రదాతలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆయుష్ శిక్షకులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. బీఎన్‌వైఎస్, యోగాలో ఉన్నత విద్య పూర్తిచేసిన నిపుణులతో రాష్ట్రస్థాయి బృందాన్ని ఏర్పాటు చేసి శిక్షణ విధానాలు, నాణ్యతా ప్రమాణాలు, జిల్లాలవారీ కార్యాచరణ రూపొందించనున్నారు.

**వ్యాధులవారీగా ప్రత్యేక సాధన :** సంజీవని పరీక్షల్లో మధుమేహం, అధిక రక్తపోటు తదితర దీర్ఘకాలిక సమస్యలు ఉన్నట్లు గుర్తించిన వారందరికీ ఒకే విధమైన యోగా సూచించకుండా.. వారి వయసు, వ్యాధి తీవ్రత, ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా ప్రత్యేక సాధన విధానాలను రూపొందించనున్నారు.

**పాఠశాలల్లో యోగా తప్పనిసరి :** పాఠశాలల్లో వారానికి రెండు రోజులపాటు యోగా తరగతులు నిర్వహించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. వ్యాయామ ఉపాధ్యాయులు ఆరు నెలల ధ్రువీకృత యోగా కోర్సును పూర్తి చేసేలా విద్యాశాఖతో కలిసి విధివిధానాలు రూపొందించనున్నారు.
విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతోపాటు మానసిక స్థైర్యం, భావోద్వేగ సమతుల్యత పెంపొందించే అంశాలను పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశపెట్టాలని ప్రభుత్వ యోగా, ప్రకృతి వైద్య సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు సూచించారు. జిల్లాల్లో ఇప్పటికే శిక్షణ పొందిన యోగా మాస్టర్ల సేవలను ఈ కార్యక్రమంలో వినియోగించుకోవాలని ప్రతిపాదించారు.
సచివాలయాలను యోగా మందిరాలుగా వినియోగించేందుకు పంచాయతీరాజ్ శాఖ, పాఠశాలల్లో యోగా అమలుకు విద్యాశాఖ, డిజిటల్ వేదిక ఆధునికీకరణకు సమాచార సాంకేతిక శాఖతో సమన్వయం చేయనున్నారు.

**చరవాణిలోనే యోగా గురువు :** ప్రస్తుతం ఉన్న 'యోగాంధ్ర' పోర్టల్‌ను పూర్తిగా ఆధునికీకరించి ప్రజలు, ధ్రువీకృత యోగా శిక్షకులను నేరుగా అనుసంధానించే ఏకీకృత వేదికగా తీర్చిదిద్దనున్నారు. ప్రజలు తమ ప్రాంతంలో అందుబాటులో ఉన్న శిక్షకుల వివరాలను చూసి సేవలను నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తారు.

**గర్భిణిలకు యోగాసనాల ప్రాధాన్యత తెలిపేలా.. :** ఎంపికచేసిన యోగాసనాలు వేయడం ద్వారా గర్భిణిలకు ప్రసవ సమయంలో సులువుగా ఉంటుందని, సహజ ప్రసవాలు జరిగేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, వీటిపై గైనిక్ వైద్యులు, నర్సులకు అవగాహన కల్పించడం ద్వారా ఫలితాలు బాగుంటాయి.
క్షేత్ర స్థాయిలో ఉండే ఆశా, ఎ.ఎన్.ఎం., ఎంఎల్‌హెచ్‌పిలకు కూడా యోగాసనాలపై అవగాహన కల్పించి, శిక్షణ ఇవ్వడం ద్వారా గ్రామీణులకు మరింత చేరువవుతుంది. పాఠశాలల్లోని వ్యాయామ ఉపాధ్యాయులను కూడా భాగస్వాములను చేయాలి.
ఇంటింటి యోగా కార్యక్రమాల కింద ప్రత్యేకంగా 'పోర్టల్'ను రూపొందించి, అందులో యోగాంధ్ర కార్యకలాపాల వివరాలు కూడా తెలుసుకునే అవకాశం కల్పించాలి. పాఠశాల విద్య నుంచే పిల్లలకు యోగాసనాల ప్రాధాన్యత తెలిపేలా బోధన జరగాలి.
యోగా అండ్ పంచకర్మ కలిపి శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఆయుష్ వైద్యులకు తప్పనిసరిగా యోగాసనాలపై శిక్షణ ఇప్పించడం ద్వారా వారు పనిచేసే ఆసుపత్రుల ద్వారా యోగా ప్రజలకు మరింత చేరువవుతుంది.
వ్యాధులవారీ యోగా వీడియోలు, ఇంటివద్ద సాధనకు అవసరమైన సూచనలు, శిక్షణ కేంద్రాల సమాచారం కూడా పోర్టల్‌లో అందుబాటులో ఉంచనున్నారు. దీనిని రియల్‌టైమ్ గవర్నెన్స్ వ్యవస్థతో అనుసంధానించేందుకు సమాచార సాంకేతిక శాఖ కార్యదర్శి స్థాయిలో ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నారు.
కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ, మొరార్జీ దేశాయ్ జాతీయ యోగా సంస్థ సహకారాన్ని కూడా ప్రభుత్వం తీసుకోనుంది. ఈమేరకు కేంద్రానికి త్వరలో అధికారులు లేఖ రాయనున్నారు.

**సమావేశానికి హాజరైన యోగా అసోసియేషన్ల ప్రతినిధులు:** విజయవాడ ఆటోనగర్‌లోని ఆయుష్ శాఖాధిపతి కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రాథమిక సమావేశంలో ఈ కార్యాచరణపై చర్చించారు. ఆయుష్ సంచాలకులు రోణంకి గోపాలకృష్ణ అధ్యక్షత వహించిన సమావేశంలో ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు, ఆయుష్ అధికారులు, విశ్వ ఆయుర్వేద పరిషత్ వర్కింగ్ ప్రెసిడెంటు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాహితీ, సీనియర్ ఆయుర్వేద వైద్యులు సుబ్రహ్మణ్యం (ప్రభుత్వ ఎంప్యానల్డ్ హాస్పటల్), జిప్సీ, యోగిపై, యోగాంధ్ర స్టార్టప్, హబిల్డ్, ఇతర అసోసియేషన్ల ప్రతినిధులు లోచన్, ఇతరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467